
ఈనాడు విశాఖపట్నం

శనివారం 28 సెప్టెంబరు 2024 సిటీ 5



కళాభారతిలో శుక్రవారం జరిగిన ప్రదర్శనలో భరతనాట్య కళాకారిణి, పద్మశ్రీ ప్రతిభా ప్రహ్లాద్ అభినయం. –న్యూస్‌టుడే, మద్దిలపాలెం

విశాఖ నగరం కారుచీకట్లలో చిక్కుకుంది. ఏ కాలనీ చూసినా అంధకారమే. రోజుల తరబడి వీధి దీపాలు వెలగకపోయినా అధికారులు కన్నెత్తి చూడటం లేదు.



అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో వెలగని వీధి దీపం

రాత్రయితే... దడే!!

మహానగరంలో అంధకారం!!
వెలగని వీధి దీపాలు వేలల్లో
మారని గుత్తేదారు తీరు
రెచ్చిపోతున్న గంజాయి ముఠాలు

ఈనాడు-విశాఖపట్నం

గత వైకాపా ప్రభుత్వంలో సాగిన నిర్లక్ష్యం నేటికీ శాపంగా మారింది. స్థానికుల నుంచి వ్యతిరేకత రావడంతో వార్డుల్లో తలెత్తుకోలేక గుత్తేదారును మార్చాలంటూ కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు.

చంద్రబాబు ముందుచూపు..

హుద్‌హుద్ తుపాన్ సమయంలో విశాఖను పునః నిర్మించే క్రమంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుతో ఆలోచించారు. నగరంలో రూ.85 కోట్లతో 85వేలకుపైగా ఎల్‌ఈడీ వీధిదీపాలను ఏర్పాటు చేశారు. ఏడేళ్లపాటు ఈఈఎస్‌ఎల్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు.

➤ తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారు చేతులెత్తేశారు. జీవీఎంసీ ఏడాదిన్నరపాటు గుత్తేదారును నియమించలేదు. ఇటీవల ఓ సంస్థకు అప్పగించినా నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది.

నగరంలో వీధి దీపాలు:	1.20 లక్షలు
వెలుగుతున్నవి:	68,000
ఏటా గుత్తేదారుకు చెల్లిస్తోంది:	రూ.7 కోట్లు

"నగరంలో వీధి దీపాలు వెలగకపోవడంతో..విశాఖ గౌరవం దెబ్బతింటోంది. ప్రతి వార్డులో ఇదే పరిస్థితి. బీచ్ రోడ్డులోనైతే సరైన కాంతిలేదని పర్యాటకులు విమర్శిస్తున్నారు."

- తాజాగా జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మొదటి నోటీసు విషయం కమిషనర్‌కు తెలియదా?

గుత్తేదారు నిర్వహణలో 95% వీధిదీపాలు ప్రతిరోజూ వెలగాలి. అలాజరగని పక్షంలో వీధిదీపం ఆరిపోయిన 24 గంటల తర్వాత ప్రతి రోజుకు రూ.50 చొప్పున అపరాధ రుసుం విధించి గుత్తేదారు బిల్లులో కోత విధించాల్సి ఉన్నా.. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. మరమ్మతుల నిమిత్తం 400 మంది కార్మికులను గుత్తేదారు నియమించుకోవాలి. కేవలం 150 మందితో నడిపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు వైకాపా కార్పొరేటర్ల అండతో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది.

➤ కొత్తగా వచ్చిన కమిషనర్ సంపత్‌కుమార్ ఐదుసార్లు నగరంలో పరిశీలన చేసి, చాలా చోట్ల వీధిదీపాలు వెలగడం లేదని గుర్తించి, సంబంధిత గుత్తేదారుకు నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. రెండు నెలల్లో పద్ధతి మార్చుకోకపోతే రెండో నోటీసు ఇస్తామని ఆయన కౌన్సిల్‌లో సమాధానమిచ్చారు.

➤ విచిత్రమేమంటే కమిషనర్ రాకముందే అప్పటికే ఒక నోటీసు గుత్తేదారు అందుకున్నారు. సంపత్‌కుమార్ ఇచ్చిన దాంతో కలిపి రెండయ్యాయి. గతంలో నోటీసు ఇచ్చిన విషయాన్ని కమిషనర్ దృష్టికి అధికారులు తీసుకురాలేదని సమాచారం.



అబిద్‌నగర్‌లోని వీధిలో చీకటి

బాబోయ్ చోరీలు: నగరంలో వీధిదీపాలు వెలగని ప్రాంతాలు కొన్ని నేరాలకు స్థావరంగా మారాయి. కొండవాలు ప్రాంతాల్లో కారు చీకట్లు కమ్మేయడంతో పార్కింగ్‌లో నిలిపి ఉంచిన ఆటోలు, ఇతర వాహనాల బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. గంజాయి బ్యాచ్‌లు చీకటి రోడ్లపై తిష్టవేసి దారి దోపిడీలకు పాల్పడుతున్నారు. కొందరు యువతులు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. సీపీ శంఖబ్రత బాగ్చీ ఇప్పటికే హెచ్చరించినా పరిస్థితి పూర్తిగా గాడిన పడలేదు.

వైకాపా పాలకవర్గ అక్రమాలను బయటపెడతాం

- అవినీతికి పాల్పడిన అధికారులను వదిలిపెట్టం
- తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో మహా విశాఖ నగరపాలక సంస్థలో చోటుచేసుకున్న అక్రమాలను బయటపెడతామని తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కూటమి కార్పొరేటర్లతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపా హయాంలో అక్రమాలకు పాల్పడిన అధికారులు, పాలకవర్గ సభ్యులను వదలబోమని, ముఖ్యంగా టీడీఆర్ అక్రమాలపై దృష్టి పెడతామన్నారు. కౌన్సిల్‌లో మూడు రోజుల పాటు కార్పొరేటర్లు తమ వార్డుల్లోని సమస్యలను వివరించడం గతంలో ఎన్నడూలేదన్నారు. వైకాపా కార్పొరేటర్లు సైతం కౌన్సిల్ నిర్వహణపై హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వైకాపా హయాంలో సుబ్బారెడ్డి, సాయిరెడ్డి విశాఖను దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. అవినీతి దస్త్రాలపై సంతకాలు పెట్టించడానికి ప్రతి ఐదు, ఆరు నెలలకు ఒక కమిషనర్‌ను మార్చారని ఆరోపించారు.

➤ 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మాట్లాడుతూ గత కమిషనర్ ఏపీ గ్రీన్ కార్పొరేషన్‌కు జీవీఎంసీ నిధులు రూ.9 కోట్లు అడ్డగోలుగా మళ్లించినట్లు జీవీఎంసీ ఉద్యానవన విభాగ ఉప సంచాలకుడు దామోదర్ కౌన్సిల్‌లో తెలిపారన్నారు. తక్షణమే గత కమిషనర్ సాయికాంత్‌వర్మపై చర్యలు తీసుకోవాలన్నారు. సీబీసీఎన్‌సీకి రూ.64కోట్ల టీడీఆర్ ఇచ్చినందుకు ప్రతిఫలంగా మాజీ ఎంపీ పాలకవర్గంలోని ఐదుగురికి ఫ్లాట్లు ఇచ్చారని ఆరోపించారు.



మాట్లాడుతున్న పీలా శ్రీనివాసరావు, చిత్రంలో కూటమి కార్పొరేటర్లు

➤ జనసేన ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కార్పొరేటర్లకు గౌరవం వచ్చిందన్నారు. వైకాపా నాయకులు రాత్రి ఆహార వీధిలో అవినీతికి పాల్పడ్డారని, అధికారం కోల్పోయిన తరువాత దాన్ని తొలగించాలని ప్రతిపాదించారన్నారు.

➤ 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో కౌన్సిల్‌లో చర్చల్లేకుండా ప్రతిపాదనలను ఆమోదించేవారన్నారు. ఇప్పుడు ప్రతి అంశంపై చర్చ జరగడం విశేషమన్నారు. కౌన్సిల్ సమావేశానికి ఉప మేయర్లు రెండు రోజులు గైర్హాజరవడాన్ని ప్రజలు గమనించాలన్నారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుపై వైకాపా సహకారంతో సీపీఎం, సీపీఐ నాయకులు తీర్మానం పెట్టడం హాస్యాస్పదమన్నారు.

➤ 57వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ మాట్లాడుతూ జీవీఎంసీ అధికారుల తీరు ఇంకా మారలేదన్నారు. ప్రజాప్రతినిధి కాని ఆడారి ఆనంద్ పేరుతో కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. స్థానిక కార్పొరేటరు ప్రతిపాదించినట్లు అజెండాలో పెట్టాలని మేయరును కోరినట్లు తెలిపారు. భాజపా ఫ్లోర్ లీడర్ గంకల కవిత తదితరులు మాట్లాడారు.

బేవాచ్ పార్కులో ఉల్లంఘనలపై చర్యలు



బేవాచ్ పార్కు

తిమ్మాపురం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి మండలం కాపులుప్పాడ రెవెన్యూ గ్రామంలోని తొట్లకొండ వద్ద ఏపీటీడీసీ లీజుకిచ్చిన బేవాచ్ పార్కులో.. సీఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (సీజెడ్‌ఎంఏ) పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్‌కు లేఖ రాసింది. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఇటీవల చేసిన ఫిర్యాదుపై సీజెడ్‌ఎంఏ స్పందించి ఈ విధంగా ఆదేశాలు జారీ చేసింది. 2018లో తొట్లకొండకి ఎదురుగా ఉన్న బీచ్‌లో పర్యాటక శాఖ నిధులతో ఈ పార్కుని నిర్మించి ప్రయివేటు వ్యక్తులకు లీజుకిచ్చారు. అప్పట్లో సీఆర్‌జెడ్ నిబంధనలకు లోబడి పార్కును అభివృద్ధి చేశారు. అయితే దాన్ని లీజుకి తీసుకున్న వ్యక్తులు శాశ్వత నిర్మాణాలను చేపట్టారని మూర్తియాదవ్ ఫిర్యాదు చేశారు. మత్స్యకారులను కూడా అక్కడి బీచ్‌లోకి వెళ్లకుండా నిబంధనలు విధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన సీజెడ్‌ఎంఏ దీనిపై చర్యలకు ఉత్తర్వులు జారీ చేసింది.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు కమ్మ అవివాహిత యువతకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లి పందిరి' కమ్మ అవివాహిత యువత కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న యువతతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (శనివారం, సెప్టెంబరు 28న), రేపు (ఆదివారం, సెప్టెంబరు 29న)** ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు **9154918858, 8008001686** ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపాలి.

–న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

విశాఖ రైలు.. తిరోగమనం!

ఆదాయం పిండుకుంటాం.. అభివృద్ధిని మాత్రం పట్టించుకోం.. అన్న విధంగా వ్యవహరిస్తున్నారు తూర్పు కోస్తా రైల్వే అధికారులు. వాల్తేరు డివిజన్ ఏటా రూ.వేల కోట్లు ఆర్జిస్తున్నా...సదుపాయాలు ఆ మేరకు లేవు.



దువ్వాడ వైపుగా ప్రత్యేక రైళ్లు
స్టేషన్ అభివృద్ధి పట్టని అధికారులు

న్యూస్‌టుడే, రైల్వేస్టేషన్

డివిజన్ ముఖ్య కేంద్రమైన విశాఖ స్టేషన్ అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది.. డీఆర్‌ఎంలు కూడా విశాఖ స్టేషన్‌లోని సమస్యలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. ఎన్ని వినతులు ఇస్తున్నా బుట్టదాఖలు అవుతున్నాయి. కొత్త రైల్వేజోన్ పేరుతో ఉన్న రైళ్లను, సౌకర్యాలను లాగేయాలని చూస్తున్నారు. డిమాండ్లపై పట్టుబట్టి సాధించుకోలేని ప్రజాప్రతినిధుల తీరు డివిజన్‌కు శాపంలా మారింది.

ఆదాయం ఎక్కువ.. అయినా శీతకన్నే: వాల్తేరు డివిజన్ నుంచి రైల్వేకు ఏటా రూ.10వేల కోట్ల ఆదాయం లభిస్తోంది. తూర్పు కోస్తా జోన్‌లో ఎక్కువ రాబడి వచ్చేది ఇక్కడి నుంచే. అయినా రైల్వే అధికారులకు ఈ డివిజన్‌పై శ్రద్ధ లేదు. ఇప్పుడు కొత్త రైల్వేజోన్ వస్తోందని అసలు పట్టించుకోవడం మానేశారు. 'వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ గతేడాది జులై 20న బాధ్యతలు స్వీకరించారు. ఏడాది కాలంలో ఆయన కొత్తవలస-కిరండూల్(కేకే) లైను, ఇతర మార్గాల్లో సుమారు 30సార్లు పర్యటిస్తే విశాఖ స్టేషన్‌ను రెండు, మూడు సార్లు కూడా సందర్శించలేదు' అని పలువురంటున్నారు.

స్టేషన్‌లో ఇవీ సమస్యలు..

» స్టేషన్‌లో ఐదు నెలల కిందట పాదచారుల వంతెన కుంగిపోతే ఇటీవల దాన్ని పునరుద్ధరించారు. మిగతా వంతెనల్లో కొన్ని శిథిల దశలో ఉన్నాయని నాడు గుర్తించారు. ఇప్పటి వరకు వాటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోలేదు. » రైళ్లు ప్లాట్‌ఫామ్‌లపైకి వచ్చిన తర్వాత బోగీల నెంబర్లను ప్రదర్శించే డిస్‌ప్లే బోర్డులు సరిగా పనిచేయడం లేదు. తాము ఎక్కాల్సిన బోగీ ఎక్కడ ఉందో తెలియక ప్రయాణికులు అటుఇటు ఉరుకులు, పరుగులు పెట్టాల్సి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు.

» అమృత్‌భారత్ పథకంలో భాగంగా జ్ఞానాపురం గేటు వైపు రూ.456కోట్లతో చేపట్టిన స్టేషన్ ఆధునికీకరణ పనులు పడకేసి ఆరు నెలలైంది. ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల సమావేశంలో త్వరలో పనులు ప్రారంభమవుతాయని డీఆర్‌ఎం చెబుతున్నారు. కాని పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది



విశాఖ రాని ప్రత్యేక రైళ్లు..

» స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీగా లేవని సుమారు 40కుపైగా ప్రత్యేక రైళ్లను దువ్వాడ మీదుగా పంపిస్తున్నారు. ఆయా రైళ్లలో అధిక శాతం తెల్లవారుజామున దువ్వాడలో ఆగుతున్నాయి. ఆ సమయంలో విశాఖ స్టేషన్‌లో సగం వరకు ప్లాట్‌ఫామ్‌లు ఖాళీగా ఉండడం గమనార్హం. విశాఖ ప్రయాణికులకు అన్యాయం జరుగుతున్నా డీఆర్‌ఎం గాని, ప్రజాప్రతినిధులు గాని స్పందించడం లేదు.

» స్టేషన్‌కు వచ్చే ప్రతి రైలు ఇంజిన్ మార్చుకుని ఇక్కడి నుంచి బయలు దేరడానికి 20నిమిషాల సమయం ఇచ్చారు. కాని ఇక్కడ 3,4 ప్లాట్‌ఫామ్‌లపై రైళ్లను 40 నిమిషాలకుపైగా ఉంచుతున్నారు. దీంతో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీ లేక అవుటర్‌లో పలు రైళ్లను గంటల తరబడి నిలిపేయాల్సి వస్తోంది. కొందరు వ్యాపారుల ప్రయోజనాల కోసమే ఆయా ప్లాట్‌ఫామ్‌లపై రైళ్లను అధిక సమయం నిలిపేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తరచూ ఇలా జరుగుతున్నా డీఆర్‌ఎం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు.

ఇవీ పరిస్థితి...

స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు:	8
నిత్యం రాకపోకలు సాగించే రైళ్లు:	120
ప్రయాణికులు:	50వేలకుపైగా
అత్యధిక రైళ్లు నిలిచే ప్లాట్‌ఫామ్‌లు:	3,4
ఏటా వచ్చే ఆదాయం:	రూ.10వేల కోట్లు

ఆగని చినుకులు... తప్పని వెతలు



జలమయమైన దొండపర్తి కూడలి



మహారాణిపేట రామకృష్ణా స్కూల్ వద్ద మ్యాన్‌హోల్...

విశాఖపట్నంలో శుక్రవారం ఉదయం నుంచి అడపాదడపా వర్షం పడుతూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ, భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయి. మహారాణిపేట, కోస్టల్ బ్యాటరీ, నోవొటెల్... ఆర్కే బీచ్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు పొంగి బయటకు వస్తోంది. కలెక్టరేట్- కోస్టల్ బ్యాటరీ మార్గంలో డ్రైనేజీ పూడికతో నిండిపోయి నీరంతా బయటకు వచ్చేస్తోంది. –ఈనాడు, విశాఖపట్నం



కోస్టల్ బ్యాటరీ ప్రధాన గేటు వద్ద..

బీచ్‌రోడ్డులో...

దంతెవాడ వరకే కిరండూల్ రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: వాల్తేర్ డివిజన్‌లో కేకే లైన్ బచేలి, కిరండూల్ ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా విశాఖ-కిరండూల్ రైళ్లను దంతెవాడ వరకు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 28 నుంచి అక్టోబరు 4 వరకు విశాఖ-కిరండూల్(08551)(08514) రైళ్లు దంతెవాడ వరకు నడుస్తాయన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 29 నుంచి అక్టోబరు 5 వరకు కిరండూల్-విశాఖ(08552)(08513) రైళ్లు దంతెవాడ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఆయా రోజుల్లో దంతెవాడ-కిరండూల్-దంతెవాడ మధ్య రైళ్ల ప్రయాణం రద్దు చేశామన్నారు.

రాకపోకలకు అనుమతివ్వాలని ఆందోళన



నేవల్ డాక్‌యార్డు వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సింధియా, న్యూస్‌టుడే : డాక్‌యార్డు సమాంతర వంతెన మరమ్మతుల కారణంగా ఎస్‌బీసీ బ్రిడ్జి మీదుగా ఉద్యోగుల రాకపోకలకు అనుమతించాలని పలువురు కోరారు. శుక్రవారం రాత్రి విజయనగర్ గేటు వద్ద ధర్నా నిర్వహించారు. నేవల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ... రెండు నెలలుగా గాజువాక నుంచి, నగరం నుంచి డాక్‌యార్డుకు వచ్చే ఉద్యోగులకు కష్టాలు తప్పడం లేదన్నారు. షీలానగర్- కాన్వెంట్‌కూడలి రహదారిలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో సంస్థ ఉద్యోగులను ఎస్‌బీసీ మీదుగా అనుమతించాలన్నారు. ధర్నాలో డాక్‌యార్డు ఉద్యోగులు, వివిధ కార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ఒప్పంద కార్మికులను ఎలా తొలగిస్తారు?'



ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసే దిశగా కేంద్రం ఆలోచనలు చేస్తున్నట్టు ఓ వైపు సమాచారం వస్తుంటే... మరోవైపు ఉక్కులో 3వేల మంది ఒప్పంద కార్మికుల్ని తొలగించేందుకు ఉక్కు కార్యదర్శి దొడ్డిదారిలో ఆదేశాలివ్వడం ఏంటని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఉక్కు పరిరక్షణకు కార్మికులు చేస్తున్న పోరాటాన్ని నీరుగార్చేందుకే ప్రభుత్వాలు ఇలాంటి చర్యలు చేపడుతున్నాయని కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, పి.వి.రమణమూర్తి ఆరోపించారు. సెయిల్‌లో 19.6 మిలియన్ టన్నుల ఉత్పత్తికి సుమారు 55 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని, విశాఖ ఉక్కులో మాత్రం 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తికి కేవలం 12వేల మంది ఉద్యోగులే ఉన్నారన్నారు. ఏ లెక్క ప్రకారం కార్మికుల్ని తొలగిస్తారని, డిప్యుటేషన్ పంపుతారని, వీఆర్ఎస్ అమలు చేస్తారని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం తీరుకు నిరసనగా శనివారం ఉక్కు అన్ని గేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.

అక్టోబరు 6న మానవహారం..

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ అక్టోబరు 6న పోరాట కమిటీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించేందుకు తీర్మానించినట్లు పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ తెలిపారు. అగనంపూడి నుంచి గాజువాక వరకు నిర్వహించే మానవహారంలో ఉక్కు ఉద్యోగులు, ఒప్పంద కార్మికులు, నిర్వాసితులు తమ కుటుంబాలతో సహా పాల్గొంటారన్నారు. శుక్రవారం ఉక్కు సిటూ కార్యాలయంలో నిర్వహించిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు. అక్టోబరు 1న విద్యార్థులతో ప్రదర్శన, 2న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష, 3న రైతులు, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించినట్టు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో ప్రతిభా ప్రహ్లాద్



సింహాచలం, న్యూస్‌టుడే: ప్రముఖ భరత నాట్య ఆచార్యులు, నృత్య దర్శకురాలు పద్మశ్రీ గ్రహీత ప్రతిభా ప్రహ్లాద్ శుక్రవారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడా మండపం ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని అర్చనల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదం అందజేశారు.

డాక్‌యార్డు ఏఎస్‌డీ నియామకం



బాధ్యతలు స్వీకరిస్తున్న రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్

సింధియా, న్యూస్‌టుడే: తూర్పు నౌకాదళ కమాండ్(ఈఎన్‌సీ) చెందిన నేవల్ డాక్‌యార్డు అడ్మిరల్ సూపరింటెండెంట్(ఏఎస్‌డీ)గా రియర్ అడ్మిరల్ కె.శ్రీనివాస్ నియమితులైనట్లు శుక్రవారం ఈఎన్‌సీ వర్గాలు తెలిపాయి. ఆయన 1990 జనవరిలో భారత నౌకాదళ విధుల్లో చేరారు. కోరుకొండ సైనిక్ స్కూల్, నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఖడక్‌వాస్లా)లో విద్యాభ్యాసం, నౌకాదళ శిక్షణ పూర్తి చేసుకున్నారు. భారత నేవీకి చెందిన ఐఎన్‌ఎస్ విరాట్, ఐఎన్‌ఎస్ విక్రమాదిత్య నౌకల్లో పని చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్ రవాణా ప్రాజెక్ట్‌లో ప్రధాన సంచాలకుడిగా, న్యూదిల్లీ నౌకాదళం ప్రధాన కార్యాలయంలో విధులు చేపట్టారు. 2022 జనవరిలో ఫ్లాగ్ ర్యాంకు దక్కించుకున్నారని నేవీ వర్గాలు పేర్కొన్నాయి.

బాక్సింగ్ విజేత.. నార్తర్న్ రైల్వే జట్టు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: అఖిల భారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీలు రైల్వే స్టేడియం సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో శుక్రవారం ముగిశాయి. పోటీల్లో నార్తర్న్ రైల్వే జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుపొందింది. సౌత్‌ఈస్ట్ సెంట్రల్ రైల్వే జట్టు టీమ్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. విజేతలకు ట్రోఫీలు, పతకాలను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అందజేశారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన తూ.కో.రైల్వే క్రీడా సంఘం ప్రతినిధులను ప్రశంసించారు.

★ 63.5 కిలోల విభాగంలో పోరు హోరాహోరీగా సాగింది. తూర్పు కోస్తా రైల్వే క్రీడాకారుడు కె.శ్యామ్‌కుమార్‌పై నార్తర్న్ రైల్వే క్రీడాకారుడు అమిత్‌కుమార్ గెలుపొందాడు. రన్నరప్‌గా నిలిచిన శ్యామ్‌కుమార్‌కు రజత పతకం దక్కింది. ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ, క్రీడాధికారి ప్రవీణ్ భాటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్, రైల్వే క్రీడా సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సకల శాస్త్రాలకు మాతృక భూ విజ్ఞానశాస్త్రం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మానవుల ప్రతి అవసరం భూమితో ముడిపడి ఉందని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కె.పద్మనాభయ్య పేర్కొన్నారు. ఏయూ భూ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'మైనింగ్, ప్రాసెసింగ్, బీచ్ సాండ్ ఖనిజాలలో ప్రస్తుత పోకడలు, వివిధ జోడింపు మైనింగ్ చట్టాలు' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సకల శాస్త్రాలకు మాతృకగా భూ విజ్ఞానశాస్త్రం నిలుస్తోందన్నారు. దేశంలో కేవలం మూడు ప్రాంతాల్లో మాత్రమే విలువైన ఖనిజాలు సముద్రపు ఇసుక నుంచి వెలికితీయడం జరుగుతోందని, ఇంకా వందకు పైగా ఖనిజాలు ప్రాంతాలు మన దేశ తీర ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ సముద్రపు ఇసుకలోని విలువైన ఖనిజాలు దేశానికి ఉపయుక్తంగా మలచుకోవాలని, అదే సమయంలో పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.



సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కె.పద్మనాభయ్య, ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు, అతిథులు

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు



ఏయూ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న ఆదిత్య కళాశాల ప్రతినిధులు



రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న ప్రైవేటు బీఈడీ కళాశాలల అధ్యాపకులు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సహాయంగా ఏయూ అనుబంధ కళాశాలలు నిధులు అందజేశాయి. ఆదిత్య విద్యా సంస్థల తరపున కళాశాల ప్రాంతీయ సమన్వయ కర్త రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్స్ శుక్రవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావుకు రూ. 5 లక్షల చెక్కును అందించారు. ప్రైవేట్ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు రూ.2.45 లక్షలు, ఎస్.కోటలోని పుణ్యగిరి డిగ్రీ కళాశాల యాజమాన్యం రూ.పదివేలు చెక్కులను రిజిస్ట్రార్‌కు అందించి ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

లారీ ఢీకొని డాక్‌యార్డ్ ఉద్యోగి మృతి



దిలీప్‌కుమార్ (పాతచిత్రం)

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే : షీలానగర్ పోర్టు రోడ్డులో జరిగిన ప్రమాదంలో డాక్‌యార్డ్ ఉద్యోగి మృతి చెందిన ఘటనపై గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి. పెందుర్తి సమీప సరిపల్లిలో నివాసం ఉంటున్న ఎం.దిలీప్‌కుమార్(33) డాక్‌యార్డ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా... టోల్‌గేటు సమీపంలో వెనుక నుంచి దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. కింద పడిపోయిన దిలీప్‌కుమార్ తలకు బలమైన గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. శిరస్త్రాణం ఉన్నా.. ప్రాణాలు దక్కలేదని కుటుంబ సభ్యులు రోదించారు. దిలీప్‌కుమార్ స్వగ్రామం అల్లూరి జిల్లా హుకుంపేట. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశామని సీఐ పార్థసారథి తెలిపారు.

డీఆర్డీఓ సుస్థిరతకు ప్రాధాన్యం

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : డీఆర్డీఓ (డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)ను సుస్థిరంగా మార్చేందుకు సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తల తోడ్పాటు అవసరమని, అందరూ కలిసికట్టుగా పని చేయాలని నేవల్ సిస్టమ్స్, మెటీరియల్స్ జనరల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఎన్ఏడీకూడలి సమీప ఎన్‌ఎస్‌టీఎల్‌లో '51వ నేషనల్ సింపోజియం ఆన్ అకౌస్టిక్స్-2024' పేరిట సదస్సును నిర్వహించారు. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రక్షణ రంగంతో పాటు, వివిధ రంగాల్లో డీఆర్డీఓ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డీఆర్డీఓ రిసోర్సెస్, మేనేజ్‌మెంట్ జనరల్ మేనేజన్ మను కోరుల్లా, ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం ధ్వని సంబంధిత ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేసి, కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు డాక్టర్ డీకే.అశ్వాల్, పీవీఎస్.గణేశ్‌కుమార్, నందగోపాలన్, మనోరంజన్. కృష్ణకుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు

ఉక్కు ఉద్యోగుల ప్రయోజనాలపై చర్చ



ఎన్ఎండీసీ సీఎండీ, డైరెక్టర్‌తో సెఫీ ప్రతినిధులు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సెఫీ)కి చెందిన ఎన్.కె. బాంచోర్, నరేంద్రసింగ్, ఇతర సభ్యులు శుక్రవారం దిల్లీలో ఎన్ఎండీసీ సీఎండీ, డైరెక్టర్(కమర్షియల్)తో సమావేశమై వివిధ అంశాలపై చర్చించినట్లు ఉక్కు కార్మిక నాయకులు తెలిపారు. ప్రధానంగా విశాఖ ఉక్కు నుంచి డిప్యుటేషన్‌పై వెళ్తున్న ఉద్యోగులకు వైద్య ప్రయోజనాలు, గృహ సంబంధిత నిబంధనల సరళీకృతంపై చర్చ సాగింది. విశాఖ ఉక్కు, నగర్ నార్ ఉక్కును సెయిల్‌లో విలీనం చేసే అంశాలపైనా చర్చించినట్లు సమాచారం.

నగరానికి పర్యాటక అవార్డుల పంట



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రాడిసన్ బ్లూ ప్రతినిధులు



మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ట్రావెల్స్ ఐక్యూ ఎండీ ఉషప్రియ

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నగరానికి అవార్డుల పంట పండింది. శుక్రవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. పర్యాటక, ఆతిథ్య, సేవారంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. రాష్ట్రంలో ఉత్తమ బీచ్‌గా రుషికొండ బ్లూఫాగ్ బీచ్ ఎంపికయింది. ఆయా విభాగాల్లో అవార్డు గ్రహీతలు వీరే...

★ **ఉత్తమ పర్యాటక ఏజెంట్:** ట్రావెల్స్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్ ★ **ఉత్తమ హోటల్(ఐదు నక్షత్రాలు, డీలక్స్):** రాడిసన్ బ్లూ రిసార్ట్ ★ **ఉత్తమ బడ్జెట్ హోటల్ :** ఎలెగంట్ ★ **ఉత్తమ బీచ్:** రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ ★ **ఉత్తమ పర్యాటక ఆకర్షణీయ ప్రదేశం :** గిరిజన మ్యూజియం, అరకు ★ **ఉత్తమ కన్వెన్షన్ సెంటర్:** చెన్నాస్ హెరిటేజ్ హోటల్ ★ **ఉత్తమ విభిన్న పర్యాటక ప్రాజెక్టు:** విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ ★ **ఉత్తమ స్వదేశీ టూర్ ఆపరేటర్:** ట్రావెల్ హోమ్ ★ **ఉత్తమ వినూత్న స్వదేశీ టూర్ ఆపరేటర్:** హాలీడే వరల్డ్ ★ **ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ :** సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ★ **ఉత్తమ పర్యాటక చిత్రం:** బుద్ధం శరణం(టీవీ టూరిజం).



ఉత్తమ బడ్జెట్ హోటల్ అవార్డు అందుకుంటున్న ఎలెగంట్ హోటల్ యజమాని పవన్ కార్తీక్



ఉత్తమ విభిన్న పర్యాటక ప్రాజెక్టు అవార్డు అందుకుంటున్న విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ యజమాని కాశీ విశ్వనాథ్




మంత్రి దుర్గేష్‌చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకట నాయుడు

డాల్ఫిన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్‌కు అవార్డు

ఎం.వి.పి.కాలనీ: విశాఖ డాల్ఫిన్ హోటల్‌కు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ డి.వెంకట నాయుడికి ఉత్తమ చెఫ్ అవార్డు దక్కింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. ఆయన డాల్ఫిన్ హోటల్‌లో గత 13 ఏళ్లుగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా పనిచేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. యూరోపియన్, వెస్ట్రన్, కాంటినెంటల్, మెక్సికన్, ఇటాలియన్, ఫ్రెంచ్, ఇండియన్ తదితర వంటకాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందారు. దేశ, విదేశాల్లో అంతర్జాతీయ, స్టార్స్ హోటళ్లలో వంటకాలను అందించిన అనుభవం ఉంది. శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

విదేశీ పర్యాటకానికి తగ్గట్టుగా విశాఖను తీర్చిదిద్దుతా

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విశాఖను పర్యాటకపరంగా తీర్చిదిద్దుతానని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. సిరిపురం బాలల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం, టూరిజం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీటిని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో విశాఖలో సైన్స్ మ్యూజియంను కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. జిల్లాలోని చారిత్రక ప్రాంతాల గొప్పతనం భావితరాలకు తెలియపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. విదేశీ పర్యాటకం అభివృద్ధికి ఇక్కడ అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దేవుడ్ని ఎంత పవిత్రంగా చూసుకుంటామో అంతే పవిత్రంగా చారిత్రక ప్రదేశాలను చూసుకోవాలని తెలిపారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లకు బహుమతులను అందజేశారు. ఎడ్యుకేషన్ టూరిజం పోస్టర్‌ను ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ కిషోర్, పర్యాటక అధికారి జ్ఞానవేణి, కళారత్న బాలకొండలరావు, అధిక సంఖ్యలో అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్‌డ్	187	206
స్కిన్‌లెస్	213	216

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - సత్యం సుందరం

ఉత్సాహంగా ఎంపిక పరీక్షలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) యూనిట్ ప్రాంగణంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్, అస్సాం రైఫిల్స్ వంటి సంస్థల్లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 23న ప్రారంభమైన ఎంపిక ప్రక్రియ నవంబరు 9 వరకు కొనసాగనుందని సిబ్బంది తెలిపారు. యూనిట్ సీనియర్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ పర్యవేక్షించారు.

ఉపముఖ్యమంత్రికి మద్దతుగా ఎమ్మెల్యే సంప్రోక్షణ దీక్ష

అప్పన్నపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ నెయ్యి కల్తీపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపడుతున్న సంప్రోక్షణ దీక్షకు మద్దతుగా అప్పన్నపాలెం పోలిపిల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలోనే అత్యంత దారుణాలు చేసే వ్యక్తిగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోతారన్నారు. ప్రజలను మోసం చేస్తే జనం ఎలాంటి బుద్ధి చెబుతారో ఇటీవల ఎన్నికల్లో చూశామన్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పంచకర్లతో పాటు స్థానిక నాయకులు పాలాభిషేకం చేశారు. కూటమి నేతలు మజ్జి సూరిబాబు, బంటు సురేశ్, నోళ్ల అప్పలరాజు, ఉమామహేశ్, మజ్జి శ్రీను, ఈశ్వరరావు, పిన్నింటి పార్వతి, పిళ్లా జగన్‌మోహన్ పాత్రుడు, మామిడి దుర్గాప్రసాదు, లక్ష్మీగోవింద తదితరులు పాల్గొన్నారు.


ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం రాంపురంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పైడిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం వెల్ఫేర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు స్వచ్ఛతను పాటించడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత అన్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో పులగవానిపాలెంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి అవగాహన ర్యాలీ చేశారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు తదితరులు

నమ్మండి ఇది రహదారే..!

అధ్వానంగా లంకెలపాలెం - అసకపల్లి రోడ్డు


గండివానిపాలెం సమీపంలో భారీ గుంత


గాయత్రి కంపెనీ సమీపంలో..

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే

ఆ దారిలో కొత్తవాళ్లు ఎవరైనా ప్రయాణిస్తే ఇది రోడ్డేనా అనక తప్పరు. ఎందుకంటే వర్షం కురిస్తే చెరువులను తలపించే గుంతలు, ఎండెక్కితే మేఘాలను తలపించే ధూళి దర్శనమిస్తాయి. పరవాడ మండలం లంకెలపాలెం నుంచి అసకపల్లి వెళ్లే ప్రధాన ర.భ.శాఖ రహదారి ధ్వంసమై ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. దారి పొడుగునా పెద్దపెద్ద రాకాసి గుంతలు ఏర్పడటంతో పాటు రాళ్లుదేలడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఈ రహదారిని పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం గుంతలను కూడా పూడ్చకపోవడంతో అవి ఇంతింతై వటుడింతై అన్నట్లు చెరువును తలపించేలా తయారయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. గుంతల్లో పెద్దఎత్తున నీరు చేరి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రెండు మండలాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో పాటు పలు పరిశ్రమలు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటంతో రద్దీగా ఎక్కువగా ఉంటుంది. రోడ్డు అంచులు ధ్వంసమై ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిమితికి మించి అధికలోడుతో బూడిద, బొగ్గు తదితర భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు తొందరగా ధ్వంసమవుతోందని పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ఈ దారిలో ప్రయాణం మరింత ఆందోళనకరంగా మారిందని, ఒళ్లు హూనం కావడంతో పాటు తరచూ వాహనాలు మొరాయిస్తున్నాయని వాపోతున్నారు. రహదారి దుస్థితిని పలుమార్లు ర.భ.శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారిని త్వరితగతిన బాగు చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


పైడివాడ అగ్రహారంలో..


పైడివాడ అగ్రహారం - గండివానిపాలెం మధ్యలో..


అసకపల్లిలో..

రక్తదాన శిబిరానికి స్పందన

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం జాగృతి సంస్థ వ్యవస్థాపకులు కె.రామకృష్ణ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఇండియా రక్తనిధి కేంద్రం సిబ్బంది హాజరై పలువురి పరీక్షలు చేసి అర్హులైన 50 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కె.సుజాత మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో కె.ఎల్.ఎన్.మౌక్తిక, రెడ్‌క్రాస్ ఇండియా సంస్థ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాతలకు ధ్రువపత్రాలు అందిస్తున్న జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ కె.సుజాత, నిర్వాహకులు

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

వేపగుంట, న్యూస్‌టుడే: తమ పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి ఎస్ఐ అసిరితాత సూచించారు. జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు ప్రస్తుత రోజుల్లో తప్పుదారి పడుతున్న తీరును వివరించారు. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు అప్పలరాజు, కార్యదర్శి జి.ఆనంద్, అధ్యక్షుడు బి.చిన్నబాబు, మహిళలు పాల్గొన్నారు.


బంటాకాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ అసిరితాత

స్వర్ణాంధ్ర-2047పై వ్యాస రచన పోటీలు

సబ్బవరం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని 2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా అభివృద్ధి చేస్తామన్న నేపథ్యంలో విద్యార్థులకు స్వర్ణాంధ్ర-2047పై అవగాహన కల్పించేందుకు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పీవీఎన్ మూర్తి, జి.భానుబంగారులక్ష్మి పర్యవేక్షించారు. వ్యాసరచనలో కొచ్చర్ల జయశ్రీ ప్రథమ, కోటపాడు దుర్గ ద్వితీయ, అనుపోజు హైమావతి తృతీయ, వక్తృత్వ పోటీల్లో పండూరి రూప ప్రథమ, మళ్ల కుందన ద్వితీయ, కర్రి సౌమ్య తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ఈనెల 28న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పీవీఎన్ మూర్తి తెలిపారు.

వైభవంగా స్నపన తిరుమంజన సేవ

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు తెల్లవారుజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, ఫలోదకాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలతో కొలిచారు. అష్టోత్తర శతనామాలతో అర్చించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


శ్రీవారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

ఘనంగా దుర్గాదేవి పందిరి రాట ఉత్సవాలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో వచ్చేనెల 3 నుంచి 12 వరకు దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం పందిరి రాట ఉత్సవాన్ని కనులపండువగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వచ్చేనెల 3న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజలు, హోమాలు, అన్నసమారాధన తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 12న పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అనుపోత్సవం ఉంటుందన్నారు. సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, నేతలు పైలా శ్రీనివాసరావు, చుక్క రామునాయుడు పాల్గొన్నారు.


పరవాడలో రాట వేడుకలో పాల్గొన్న భక్తులు, నాయకులు, నిర్వాహకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి పాత పీహెచ్‌సీ ఎదురుగా దుర్గాదేవి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పందిరి రాట వేడుక సంప్రదాయబద్ధంగా జరిపారు. మహిళలు రాటకు పసుపు కుంకుమ పూశారు. అర్చకులు పూజలు చేసి వేదిక ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పెందుర్తిలో రాట వేస్తున్న భక్తులు

బదిలీపై వెళ్లిన అధికారులకు సత్కారం

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో సబ్బవరం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారులను స్థానిక సిబ్బంది శుక్రవారం సన్మానించారు. సబ్బవరం ఉప తహసీల్దార్ ఐ.వెంకటఅప్పారావు, మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, టైపిస్టు విజయ్‌కుమార్‌తో పాటు మరో ఆరుగురు గ్రామ సర్వేయర్లు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఎస్టీ రామకాసు, సబ్బవరం ఆర్ఐవో వీరయ్య వీరిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు రుక్మిణి, పూడి శేషు, సిబ్బంది పాల్గొన్నారు.


బదిలీపై వెళ్తున్న అధికారులను సత్కరించిన స్థానిక అధికారులు, సిబ్బంది


కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

పరవాడ, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పరవాడ మండలం నాయుడుపాలెం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సర్పంచి కూండ్రపు వరలక్ష్మి, నాయకులు కె.మధు, సీతారామయ్య, శ్రీరామ్మూర్తి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



వరద కాదు.. వృథా నీరు

ఈ చిత్రంలో రహదారిపై నిలిచిన నీటిని చూసి వర్షం నీరు అనుకుంటే పొరబడినట్టే. జీవీఎంసీ మంచినీటి పైపులైను పగిలి వృథా అవుతున్నా విలువైన తాగునీరు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని జీవీఎంసీ పైపులైను శుక్రవారం లీకేజీకి గురయ్యింది. పైపులు పగిలి పెద్దఎత్తున మంచినీరు వృథా అవుతోంది. ఇంద్రాణి కల్యాణ మండపానికి వెళ్లే దారిలోని కల్వర్టు వద్ద పైపులైను దెబ్బతింది. దీంతో ఉదయం నుంచి భారీఎత్తున మంచి నీరు రోడ్డు పాలయింది. బీఆర్టీఎస్ రహదారిలో నీరు నిలిచిపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తక్షణమే అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, చినముషిడివాడ (పెందుర్తి)

దర్పణం

ఎట్టకేలకు గొయ్యి పూడ్చివేత

వేపగుంట, న్యూస్‌టుడే

జీవీఎంసీ 93వ వార్డు విరాట్‌నగర్ కూడలిలో మంచినీటి విభాగం సిబ్బంది అవసరం కోసం గొయ్యిని తవ్వి వదిలేయడంతో పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయమై ఈనెల 20న 'గొయ్యి చూసి అడుగెయ్యి' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని సిబ్బందిని ఆదేశించారు. మంచినీటి సరఫరాకు అవసరమైన సంపును నిర్మించి గుంతను పూడ్చారు.



ఈనాడు కథనానికి స్పందన

మ్యాన్‌హోల్ మూత ఏర్పాటు

పరవాడ, న్యూస్‌టుడే

పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ నుంచి పరవాడ బీసీ కాలనీకి వెళ్లే మార్గంలోని మ్యాన్‌హోల్ ఎట్టకేలకు మూత ఏర్పాటు చేశారు. గత కొంతకాలం నుంచి మ్యాన్‌హోల్‌పై ఇనుప డ్రమ్మును పెట్టి నెట్టుకొచ్చారు. రాత్రి సమయంలో చీకటి కారణంగా డ్రమ్ము కనబడక పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి సిమెంట్ మూతను ఏర్పాటు చేశారు.



ప్రభుత్వ పింఛనుదారుల కార్యాలయం ప్రారంభం

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం పెందుర్తి యూనిట్ కార్యాలయాన్ని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శుక్రవారం ప్రారంభించారు. స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆమె రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సంఘానికి శాశ్వత భవనం నిర్మాణానికి సహకరించాలని కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అల్లం కృష్ణారావు, కార్యదర్శి వై.కామరాజు, ఉపాధ్యక్షుడు ఎ.ఈశ్వరరావు, సహ కార్యదర్శులు డి.భాస్కరరావు, జి.రామునాయుడు, కార్యవర్గ సభ్యులు రామానందం, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


పింఛనుదారులతో 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత

పెందుర్తి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం తహసీల్దార్‌గా **ఎం.ఆనంద్‌కుమార్** శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా కోరాడ వేణుగోపాల్‌ను పెందుర్తి తహసీల్దార్‌గా నియమించారు. ఇంతలోనే ఆయన్ను వీఎంఆర్‌డీఏ ప్రత్యేక తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో పద్మనాభం మండలం తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌ను పెందుర్తి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఆనంద్‌కుమార్ ఎన్నికలకు ముందు పెందుర్తి తహసీల్దార్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఆయన బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కార్యాలయం అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌గా కీర్తిప్రియ



చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన **ఎ.కీర్తిప్రియ** శుక్రవారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె విజయనగరం జిల్లా చిట్స్ విభాగం నుంచి పెందుర్తికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేలా లావాదేవీల నిర్వహణకు కృషి చేస్తామన్నారు. కార్యాలయం సీనియర్ సహాయకుడిగా సన్యాసిరావు విధుల్లో చేరారు.

సబ్బవరం ఏవోగా కె.ఎస్.పి.నారాయణరావు



సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల పరిషత్ పరిపాలనా అధికారి (ఏవో)గా **కె.శివ ప్రసాద్ నారాయణరావు** శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాంబిల్లి నుంచి సబ్బవరం వచ్చారు. గతంలో చోడవరం, అనకాపల్లి, విశాఖ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విధులను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఏవో ఎస్‌కే బాబూరావు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, శ్రీదేవి తదితరుల పాల్గొన్నారు.

పెందుర్తి డీఈఈగా కోటేశ్వరరావు

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ పెందుర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా **చొక్కాకుల కోటేశ్వరరావు** బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మండలంలో విద్యుత్తు సంబంధిత సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.


ఎమ్మెల్యేతో డీఈఈ

పెట్రో కెమికల్స్ పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- ఐదేళ్లలో గుజరాత్, ఆంధ్ర, ఒడిశాల్లో ఈ రంగంలో 3.7 లక్షల మందికి ఉపాధి
- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా



పారిశ్రామికవేత్తల సమావేశంలో మాట్లాడుతున్న నివేదితా శుక్లా

ఈనాడు, విశాఖపట్నం: గుజరాత్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల్లో మూడు పెట్రోకెమికల్, పెట్రో ఇండస్ట్రియల్ రీజియన్ (పీసీపీఐఆర్)ల ద్వారా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 3.7 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ కార్యదర్శి నివేదితా శుక్లా వెల్లడించారు. విజన్ భారత్‌లో భాగంగా వచ్చే ఐదేళ్లలో ఆ లక్ష్యాలను చేరుకుంటామని ప్రకటించారు. 'పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్‌లో అనుకూల వాతావరణం కనిపిస్తోందన్నారు. అక్టోబర్ 17 నుంచి 19 వరకు ముంబయిలో కేంద్ర ప్రభుత్వం, ఫిక్కీ ఆధ్వర్యంలో 13వ ఇండియా కెమ్-2024 ప్రదర్శన జరగనుంది. ఈ నేపథ్యంలో విశాఖలో శుక్రవారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సమావేశంలో నివేదితా శుక్లా మాట్లాడారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టుబడిదారుల స్నేహపూర్వక వాతావరణం కనిపిస్తోంది. ఇక్కడ సువిశాల తీరప్రాంతం ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మొదటి స్థానంలో ఉంది. కొత్త ప్రభుత్వం ఈ ఏడాది రూ.లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చి, 1.3 లక్షల మందికి ఉపాధి చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఎక్కువ పెట్టుబడులు ఏపీకి తీసుకువచ్చేలా ఇండియా కెమ్ ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థలో రసాయన, పెట్రో కెమికల్స్ రంగం చాలా కీలకమైంది. ప్రపంచ మార్కెట్‌లో మనం ఆరో స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం రసాయన మార్కెట్ విలువ సుమారు 220 బిలియన్ డాలర్లుగా ఉంది. 2040 నాటికి రూ.లక్ష కోట్ల రూపాయలకు పెరుగుతుంది' అని చెప్పారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రసాయన, పెట్రో కెమికల్స్ రంగంలో ఉపాధి అవకాశాల కోసం యువతకు పెద్ద ఎత్తున నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారి కోసం నిబంధనలు సరళతరం చేయాలని సూచించారు. రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ నూతన పారిశ్రామిక విధానంతో ఈ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించాలని చూస్తున్నామన్నారు. ఈ ఏడాది కేంద్రం బడ్జెట్‌లో కేటాయించిన వంద పార్కుల్లో మూడు మన రాష్ట్రానికి కేటాయించాలని, వాటిలో ఒకటి ప్రత్యేకంగా కెమికల్ పార్క్ ఉండేలా చూడాలని కోరారు. ఏపీలో పీసీపీఐఆర్ ఉన్నప్పటికీ భారీ పరిశ్రమలేవీ రాలేదని.. దీని గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో ఇటీవలే మాట్లాడారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 90 పారిశ్రామికవాడల ఏర్పాటుకు అవసరమైన భూములు సేకరించామన్నారు. కార్యక్రమంలో కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి దీపాంకర్ అరోన్, గంగవరం పోర్టు సీఈఓ అమిత్ మాలిక్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సుదర్శన్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.



జగన్‌తో సమావేశమైన జిల్లా నేతలతోపాటు ఉన్న అనంతబాబు (వృత్తంలో)

కలిసికట్టుగా పని చేయండి

వైకాపా నేతలతో ఆ పార్టీ అధ్యక్షుడు జగన్

ఈనాడు, అమరావతి: 'ప్రజాసమస్యల పరిష్కారం కోసం గట్టిగా నిలబడండి.. ఇందుకోసం ఎక్కువ సమయాన్ని కేటాయించండి.. జిల్లాలోని పార్టీ నేతలంతా ఒక కుటుంబంలా, కలిసికట్టుగా పనిచేయాలి' అని వైకాపా అధ్యక్షుడు జగన్ ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నేతలతో సమావేశమయ్యారు. 'ప్రభుత్వం తీసుకునే ప్రజావ్యతిరేక నిర్ణయాలు, హామీలను అమలు చేయకపోవడంపై ప్రజల్లోకి వెళ్లేందుకు అందరూ సమన్వయంతో వ్యవహరించాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల అధ్యక్షుల ఎంపికపై చర్చించారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి కురసాల కన్నబాబునే కొనసాగించాలని నిర్ణయించారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజికవర్గానికిచెందిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను పునః నియమించనున్నారు.. కోనసీమ జిల్లాకు ఎస్సీ సామాజికవర్గానికి అవకాశం కల్పించాలని నేతలు సూచించినట్లు తెలిసింది. దీంతో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్‌ను కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా ఖరారుచేసినట్లు సమాచారం. ఈ సమావేశానికి ఇటీవలే ఎన్నికల్లో అమలాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీచేసి ఓడిన రాపాక వరప్రసాదరావు గైర్హాజరయ్యారు.

ఎమ్మెల్సీ అనంతబాబు ప్రత్యక్షం: కాకినాడ, కోనసీమ జిల్లాల వైకాపా నేతలతో జగన్ నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్సీ అనంతబాబు హాజరవ్వటం చర్చనీయాంశంగా మారింది. దళిత యువకుడి హత్య కేసులో నిందితుడిగా జైలుకు వెళ్లిన ఆయన ఇప్పుడు బెయిల్‌పై బయట ఉన్నారు. హత్య జరిగినప్పుడు ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఇప్పటికీ ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేయలేదు. కానీ అనంతబాబు మాత్రం గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్వహించిన చాలా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇప్పుడు కూడా క్యాంపుకార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రత్యక్షమవడం గమనార్హం.

రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాల స్వాధీనం

చెన్నై నౌకాశ్రయంలో పట్టివేత

చెన్నై (పారిస్), న్యూస్‌టుడే: చెన్నై నౌకాశ్రయంలో రూ.110 కోట్ల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి వారు తెలిపిన వివరాల మేరకు.. చెన్నై నౌకాశ్రయం నుంచి ఆస్ట్రేలియాకు ఓడలో వెళ్లనున్న కంటెయినర్‌లో రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. అందులో 112 కిలోల సూడోఎఫెడ్రిన్ అనే మత్తు పదార్థం ఉన్నట్లు గుర్తించారు. దీని రవాణాకు ఉపయోగించిన 2 లగ్జరీ కార్లతో పాటు రూ.3.9 లక్షల స్వాధీనం చేసుకుని అబుతాహిర్, అహ్మద్ బాషా అనే ఇద్దరు ఏజెంట్లను అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా.. ఇదే విధంగా నాలుగుసార్లు ఆస్ట్రేలియాకు మత్తు పదార్థాలు తరలించారని, అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు ఇందులో ప్రమేయం ఉందని తేలింది. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



విజయం దక్కాలంటే..


విజయం సాధించాలంటే ప్రేరణ అవసరం. కానీ అదొక్కటే సరిపోదు. ప్రారంభించే ధైర్యం ఉండాలి. మొదలుపెట్టిన పనిని నిలకడగా కొనసాగించాలి. విమర్శలను సమర్థంగా ఎదుర్కోవాలి. అనిశ్చిత పరిస్థితులు, వైఫల్యాలను అధిగమించగల మానసిక బలం కావాలి. వీటన్నింటికీ ఆప్తుల అండదండలూ తోడవ్వాలి.

– హిమాన్షు త్యాగి, ఐఎఫ్ఎస్ అధికారి

పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన విరమణ

- మంత్రి హామీలకు సానుకూలంగా నిర్ణయం

ఈనాడు, అమరావతి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ ఆందోళన కార్యక్రమాలను విరమించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ నుంచి లభించిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు లేఖను వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు సచివాలయంలో శుక్రవారం అందజేశారు. ఇన్‌సర్వీస్ కోటాలో పీజీ వైద్యవిద్యకు కేటాయించిన సీట్లను తగ్గిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ 85ను నిరసిస్తూ ఈ నెల 17 నుంచి పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనలు చేస్తున్నారు. సంఘం ప్రతినిధులతో చేపట్టిన చర్చల్లో మంత్రి సత్యకుమార్ 85 జీఓను సవరిస్తామని, క్లినికల్ విభాగంలో 15% బదులు 20% సీట్లను అన్ని స్పెషాలిటీల్లో కేటాయిస్తామని తెలిపారు. సంఘంతో చర్చించిన తర్వాతే ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల కేటాయింపుపై నిర్ణయాలు తీసుకుంటామని, ఇతర డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. వీటిని స్వాగతిస్తూ.. సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్, ఇతర వైద్యులు కృష్ణబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 17 నుంచి తాము విధుల్లో ఉన్నట్లు పరిగణించి వేతనాలు చెల్లించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, ట్రైబల్ ఎలవెన్సులు చెల్లించాలని అందులో కోరారు.



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు లేఖ అందిస్తున్న వైద్య సంఘం ప్రతినిధులు వినోద్, రాహుల్ తదితరులు

నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదుకు ఆదేశం



బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు తిలక్‌నగర ఠాణా పోలీసులను చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఎన్నికల బాండ్ల పేరిట పలువురు పారిశ్రామికవేత్తలను నిర్మలా సీతారామన్ బెదిరించి భాజపాకు నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్ష పరిషత్తుకు చెందిన ఆదర్శ్ అయ్యర్ గతంలో తిలక్‌నగర ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. పోలీసులు ఫిర్యాదు తీసుకోకపోవడంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ పూర్తి చేసిన న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించి, తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేశారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యపై కేసు

- 'ముడా' అంశంపై లోకాయుక్త చర్యలు

ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ(ముడా) స్థలాల పంపిణీ అక్రమాల్లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఆ రాష్ట్రంలో కేసు నమోదైంది. మైసూరు లోకాయుక్త ఎస్పీ ఉదేశ్ శుక్రవారం ఈ కేసు నమోదుచేశారు. ముడా అక్రమాలపై విచారణ చేపట్టిన సంబంధిత కోర్టు.. 3 నెలల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇటీవల లోకాయుక్తను ఆదేశించిన క్రమంలో ఈ చర్యలు చేపట్టారు. స.హ. కార్యకర్త స్నేహమయి కృష్ణ చేసిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కోర్టు ఈ తీర్పు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ముఖ్యమంత్రి ఏ1, ఆయన సతీమణి పార్వతి ఏ2, బావమరిది మల్లికార్జున స్వామి ఏ3, భూములు విక్రయించిన దేవరాజు ఏ4, ఇతరులను ఏ5 నిందితులుగా పేర్కొన్నారు. సీఎంపై భూ ఆక్రమణల నియంత్రణ, అవినీతి నిరోధక, ఫోర్జరీ, బినామీ ఆస్తుల పరిరక్షణ, అధికార దుర్వినియోగం తదితర అభియోగాల కింద పలు సెక్షన్లు పెట్టారు. ఈ క్రమంలో తన రాజీనామా కోసం విపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'గోద్రా కేసులో ఆనాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ రాజీనామా చేశారా? అక్రమ గనుల తవ్వకాల కేసులో బెయిల్‌పై ఉన్న కేంద్రమంత్రి కుమారస్వామి నుంచి ప్రధాని రాజీనామా కోరారా?' అంటూ ప్రశ్నించారు. తాను తప్పు చేయలేదని, రాజీనామా చేయనని స్పష్టం చేశారు.

రాజీనామా చేయాల్సిన అవసరం లేదు: ఖర్గే

సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన అవసరంలేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. శుక్రవారం ఆయన బెంగళూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కేసు నమోదు చేయగానే సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటే.. గోద్రా కేసులో మోదీ రాజీనామా చేశారా? అమిత్ షా పైనా కేసులున్నాయి కదా? అని గుర్తు చేశారు. సీబీఐకి సాధారణ సమ్మతి ఉపసంహరణ చర్యనూ ఖర్గే సమర్థించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

అక్కడికి నేనొచ్చినట్లు ఎవరూ చెప్పలేదు

'ఈనాడు' కథనానికి సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ వివరణ

ఈనాడు, అమరావతి: మాజీ ఎంపీ, ప్రస్తుత ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అరెస్టయిన రోజున తాను సీఐడీ గుంటూరు ప్రాంతీయ కార్యాలయానికి వచ్చినట్లు ఎవరూ వాంగ్మూలం ఇవ్వలేదని సీఐడీ పూర్వ డీజీ సునీల్‌కుమార్ తెలిపారు. 'కస్టడీలో రఘురామకు చిత్రహింసలు నిజమే' అనే శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఓ ప్రకటనలో ఆయన వివరణ ఇచ్చారు. "ఆరు నెలలకు మించి కాల్ డేటా ఉండదు. అదే విషయం టెలికం సంస్థలూ చెప్పాయి. అలాంటిది నా లొకేషన్ ఎలా వచ్చింది? అది అబద్ధం. రఘురామకృష్ణరాజుకు గాయాల్లేవంటూ ఇచ్చిన సర్టిఫికెట్‌కు గుంటూరు వైద్యులు కట్టుబడి ఉన్నారు. వారు వేరే విధంగా వాంగ్మూలం ఇవ్వలేదు, ఇవ్వరు కూడా. తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చామని ఒప్పుకొంటే వారి డాక్టర్ సర్టిఫికెట్ రద్దవుతుంది. రఘురామకు గాయాలు ఉన్నాయని, కొట్టడంవల్లే అవి అయ్యాయని మిలటరీ ఆసుపత్రి వైద్యులు చెప్పలేదు. మిలటరీ డాక్టర్లు సివిల్ కోర్టులకు రారు, సాక్ష్యం చెప్పరు. అది ఆర్మీ యాక్టు వారికి కల్పించిన రక్షణ" అని సునీల్‌కుమార్ వివరించారు.

మార్చిలో ఇంటి నిర్మాణ సాయం పెంపు: మంత్రి కొలుసు

చాట్రాయి, న్యూస్‌టుడే: అందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో త్వరలో స్థలాల కొనుగోలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూల నిర్ణయం తీసుకోనున్నారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా మర్లపాలెంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. మార్చిలో గృహనిర్మాణ సాయం మొత్తాన్ని పెంచుతామని, ఎంత పెంచాలనేదానిపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. సొంత స్థలం ఉన్న పేదలు వెంటనే గృహాలు నిర్మించుకునే అవకాశముందని పేర్కొన్నారు.

కోరా షూస్ షోరూం ప్రారంభం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ద్వారకానగర్ మొదటి లైనులో ఏర్పాటు చేసిన కోరా షూస్ షోరూంను శుక్రవారం విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పాదరక్షలను విక్రయించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. షోరూం అధిపతి కేవీ చలపతి మాట్లాడుతూ తమకు ఈ రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉందన్నారు. ఏడాదికి 12లక్షల లెదర్ బూట్లు(షూస్), ఉత్పత్తులను యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. 2020-21, 2022-23 సంవత్సరాల్లో అఖిల భారత స్థాయిలో ఎక్స్‌పోర్ట్ ఎక్సలెన్సీ అవార్డు లభించిందన్నారు. విశాఖ నగరవాసులకు నాణ్యమైన పాదరక్షలను సరసమైన ధరలకు అందించాలన్న సంకల్పంతో ఇక్కడ అవుట్‌లెట్ ప్రారంభించినట్లు వివరించారు.



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఘనంగా కాయల వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుక

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కేవీఆర్ గ్రూప్ ఛైర్మన్ కాయల వెంకటరెడ్డి పుట్టినరోజు వేడుక శుక్రవారం ఘనంగా జరిగింది. తన సహచరులతో తిరుమలలో వెంకన్న స్వామిని దర్శించుకుని, అనంతరం కేకు కోశారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు. విశాఖ జిల్లా సీతమ్మధారలోని కేవీఆర్ ఎస్టేట్ కార్యాలయంలో ఆయన సోదరుడు కాయల సూరారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.



కేక్ కోస్తున్న సూరారెడ్డి, తదితరులు

29న మాజీ రెక్టార్ ఆచార్య ప్రసన్నకుమార్ జన్మదిన వేడుకలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విద్యావేత్త, ఏయూ మాజీ రెక్టార్ ఆచార్య అయ్యగారి ప్రసన్నకుమార్ 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'నవతీ ప్రసన్నం' పేరుతో ఈనెల 29న వేడుకలు నిర్వహిస్తున్నట్లు విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షులు డాక్టర్ జి.రఘురామారావు తెలిపారు. శుక్రవారం ఉదయం అంకోసా సమావేశమందిరంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రసన్నకుమార్ 20కు పైగా పుస్తకాలను రచించారని చెప్పారు. నగర ప్రముఖునిగా పేరొందిన ప్రసన్నకుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఉదయం 10గంటలకు అంకోసాలో ప్రారంభమవుతాయన్నారు. ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ప్రత్యేక అతిథులుగా మిజోరం గవర్నర్ కె.హరిబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు ఆచార్య సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అలల సవ్వడి... కపోతాల సందడి

విశాఖ ఆర్కేబీచ్‌లో గుంపులు..గుంపులుగా పావురాలు సందడి చేస్తుంటాయి. సందర్శకులతో పాటు ఉదయం వేళ వ్యాయామానికి వచ్చిన వారిని అవి ఆకట్టుకుంటుంటాయి. తీరానికి వచ్చే ఎంతో మంది వాటికి నిత్యం ఆహారంగా గింజలు వేస్తుంటారు. ఎవరొచ్చినా వారి దగ్గరగా వాలి... మళ్లీ రివ్వున ఎగిరిపోతుంటాయి. శుక్రవారం సాగర తీరంలో కపోతాల సందడిని ఇక్కడ చూడొచ్చు. – ఈనాడు, విశాఖపట్నం

9 మంది డీటీల బదిలీల్లో స్వల్ప మార్పులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 9 మంది డీటీ(ఉప తహసీల్దార్)ల బదిలీల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎస్.సురేష్‌కుమార్‌ను డీసీఎస్‌ఓ కార్యాలయానికి, ఎ.సుష్మను జీవీఎంసీకి, ఎ.సంధ్యను విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల విభాగానికి, పి.సూర్యకళను గాజువాక ఎన్నికల విభాగానికి, డి.సంజీవరావును అల్లూరి సీతారామరాజు జిల్లాకు, కె.త్రినాథరావును పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల విభాగానికి, ఎల్‌బీ నాగలక్ష్మిని యూసీడీ పీడీ కార్యాలయానికి, డి.రమను ములగాడ తహసీల్దార్ కార్యాలయానికి, కె.అనిల్‌కుమార్‌ను సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయానికి డీటీలుగా బదిలీ చేశారు. వీరితో పాటు 11 మంది వీఆర్వో (గ్రేడ్-2)ల బదిలీల్లో మార్పులు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఉత్తర్వులు విడుదల చేశారు.

విశాఖ జిల్లా ఎక్సైజ్ శాఖ డీసీ బాధ్యతల స్వీకరణ



డి.శ్రీరామ చంద్రమూర్తి | సి.హెచ్. మహేష్‌కుమార్

మాధవధార, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లాల (విశాఖ, అనకాపల్లి, అల్లూరి) ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీరామ చంద్రమూర్తి శుక్రవారం మాధవధారలో ఉన్న డీసీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు సెబ్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. సెబ్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడంతో డీసీగా నియమితులయ్యారు. త్వరలో ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల టెండర్లను పారదర్శకంగా నిర్వహించడం, గంజాయి నిర్మూలన, ఎక్సైజ్ నేరాల కట్టడికి తన వంతుగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఏసీ బాధ్యతల స్వీకరణ: విశాఖ జిల్లా ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా సి.హెచ్.మహేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు బాపట్ల జిల్లాలో సెబ్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తూ వెయిటింగ్‌లో ఉన్నారు. సెబ్‌ను ఎక్సైజ్ శాఖలో విలీనం చేసిన తర్వాత విశాఖ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు.

బంగారం చోరీ కేసులో నిందితురాలి అరెస్టు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: బంగారం చోరీ కేసులో నిందితురాలిని ఒక్క రోజులోనే రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 46 గ్రాముల ఆభరణాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తవలస మండలం మంగళంపాలెం సమీపంలోని ఆళ్లవారి వీధికి చెందిన ఆళ్ల లత ఈనెల 26న తోడికోడళ్లతో కలిసి బంగారం కొనుగోలు చేయడానికి సంపత్ వినాయగర్ సమీపంలోని ఓ దుకాణానికి వెళ్లారు. అక్కడ 46 గ్రాముల బంగారు ఆభరణం కొనుగోలు చేశారు. తర్వాత ఆటో ఎక్కి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. అక్కడ కొత్తవలస వెళ్లే 12డీ ఆర్టీసీ సిటీ బస్సు ఎక్కారు. అనంతరం తన బ్యాగును తనిఖీ చేసుకోగా బంగారు ఆభరణం కనిపించలేదు. ఈ మేరకు రెండో పట్టణ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈస్ట్ క్రైమ్ సీఐ సీహెచ్ రాజులనాయుడు పర్యవేక్షణలో రెండో పట్టణ ఎస్సై సునీల్, సిబ్బంది దర్యాప్తు జరిపి సీసీ కెమెరాల ఆధారంగా నిందితురాలు కొత్తవలస ప్రాంతానికి చెందిన గంట తులసిగా గుర్తించి అరెస్టు చేశారు. క్రైమ్ డీసీపీ కె.లతా మాధురి, ఏసీపీ ఎ.వెంకటరావు దర్యాప్తు తీరును పరిశీలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణం

6 నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర జిల్లా సభ్యులు

మాధవధార, న్యూస్‌టుడే: ఏపీ ఉపాధ్యాయుల సమాఖ్య(ఏపీటీఎఫ్) ఆవిర్భవించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా అక్టోబర్ 6,7,8 తేదీలలో విజయనగరంలో నిర్వహించనున్న 20వ రాష్ట్ర విద్యా-వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు కోరారు. శుక్రవారం మాధవధారలో ఏపీటీఎఫ్ జిల్లా సభ్యుల ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.ఎస్.నాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధనుంజయరావు, జాకబ్ సేవియర్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయ ఈఓగా శోభారాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న శోభారాణి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఈఓగా కె.శోభారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఉప కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెను అమ్మవారి ఆలయ ఈఓగా బదిలీ చేశారు. శుక్రవారం విశాఖకు చేరుకున్న ఆమె ఉదయం అమ్మవారిని దర్శించుకొని బాధ్యతలు స్వీకరించారు. ఆలయ ఈఈ సీహెచ్‌వీ రమణ, ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు కె.పద్మజ, ఎం.వి.రమణ, ఎ.తిరుపతిరావు, తదితరులు శోభారాణిని కలిసి అభినందనలు తెలిపారు.


3 నుంచి కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పాతనగరం కురుపాం మార్కెట్ ప్రాంతంలో వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు వాసవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్, పెనుగొండ కామరాజు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. తొమ్మిదిరోజులపాటు అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమిస్తామని పేర్కొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆకట్టుకున్న ఎఫ్ఎస్ఐ ప్రదర్శన



అగ్ని నివారణ యంత్రాల పనితీరును వివరిస్తున్న ఎఫ్ఎస్ఐ ఉద్యోగి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: చేపలరేవులోని 5,6 జెట్టీల్లో నిలిపి ఉంచిన భారత మత్స్యపరిశోధన సంస్థ(ఎఫ్ఎస్ఐ)కు చెందిన మత్స్యదర్శిని, మత్స్యషికారి సర్వే నౌకల్లో శుక్రవారం మినీ ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగులు రెండు నౌకల కార్యకలాపాల గురించి వివరించారు. వాటిల్లోని నావిగేషన్, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, లైఫ్ సేవింగ్, అగ్నిమాపక ఉపకరణాల పనితీరును విడమర్చి చెప్పారు. మత్స్య సంపద అభివృద్ధికి దోహదపడే అంశాలను ప్రదర్శించారు. బెహరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మారిటైమ్ కళాశాల విద్యార్థులు, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ (సిఫ్‌నెట్) విద్యార్థులు, సామాన్య ప్రజలు 300 మంది వరకు ప్రదర్శనను సందర్శించారు. ఎఫ్ఎస్ఐ ముఖ్య అధికారి భామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందులకైనా డబ్బులు ఇప్పించండి

ది జయలక్ష్మి ఎంఎఎం కోఆపరేటివ్ సొసైటీ మహాజన సభలో బాధితుల ఆవేదన

గాంధీనగర్, సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కనీసం మందులు కొనుక్కునేందుకైనా డబ్బులు ఇప్పించాలని ఒకరు.. కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న డబ్బులు పోయాయి. అప్పు చేసి వివాహం చేశాం.. వాటికి వడ్డీ చెల్లించేందుకైనా కొంత సొమ్ము వచ్చేలా చూడాలని మరొకరు.. ఇలా ది జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మహాజన సభలో సభ్యుల ఆవేదనలు మిన్నంటాయి. సొసైటీ మహాజన సభ శుక్రవారం కాకినాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా తీర్మానాలు ప్రవేశపెట్టిన సమయంలో పలువురు సభ్యులు వాటిని ఆక్షేపిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. కొద్దిసేపు గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అనంతరం సొసైటీ తరఫున ప్రభుత్వం, కోర్టు, రుణగ్రహీతలపై జరిపే లావాదేవీలన్నీ పాలకవర్గ సభ్యులకు అప్పగిస్తూ సభ్యులు తీర్మానంలో ఆమోదించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు మాట్లాడుతూ రూ.500 కోట్లు రుణాలు తీసుకుని చెల్లించని వారి ఆస్తులను సీబీసీఐడీ జప్తు చేసిందన్నారు. కోర్టు నుంచి సేల్ ఆర్డర్ వచ్చిన తర్వాత వాటిని విక్రయించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

డీసీఎస్ఓగా భాస్కర్‌రావు బాధ్యతల స్వీకరణ



భాస్కర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పూర్వ డీసీఎస్ఓ సూర్యప్రకాశరావు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ)గా వి.భాస్కర్‌రావు శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ పనిచేసిన జి.సూర్యప్రకాశరావును శ్రీకాకుళం డీసీఎస్ఓగా బదిలీ చేశారు. రేషన్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రతి ఒక్కరికి సకాలంలో సరకులు అందజేయడంతోపాటు అక్రమాలపై నిఘా పెంపునకు చర్యలు తీసుకుంటామని భాస్కర్‌రావు తెలిపారు. బదిలీపై వెళుతున్న సూర్యప్రకాశరావును కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, ఏఎస్ఓలు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

★ సర్కిల్2 సహాయ సరఫరా అధికారిణి (ఏఎస్ఓ)గా కల్యాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

రాష్ట్ర స్థాయి టీటీ ర్యాంకింగ్ పోటీలు ప్రారంభం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి టీటీ (టేబుల్ టెన్నిస్) ర్యాంకింగ్ పోటీలు శుక్రవారం గీతం డీమ్డ్ వర్సిటీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఇక్కడ ప్రతిభ కనబరచి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావాలన్నారు. టోర్నీలో వివిధ విభాగాల్లో 400 మంది క్రీడాకారులు తలపడుతున్నారు. కార్యక్రమంలో గీతం వర్సిటీ వీసీ ఆచార్య గౌతమరావు, స్పోర్ట్స్ డైరెక్టరు విజయకుమార్, ఎస్ఎంఎస్ డెంటల్ ఛైర్మన్ డాక్టర్ బి.శ్రీధర్, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం ఉపాధ్యక్షుడు జె.కె.నాయక్, జిల్లా సంఘం కార్యదర్శి డి.వి.ఎస్.వై.శర్మ, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్ తదితరులు

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సీతంపేట, న్యూస్‌టుడే : విద్యార్థులు మాదక ద్రవ్యాల వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఒక కార్యక్రమంలో శుక్రవారం విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ అనిరుద్ కోవెళ్లి మాట్లాడుతూ ఆరోగ్య, ఆహార నియమాలను వివరించారు. పోషక ఆహారాన్ని స్వీకరించాలని, జీర్ణ వ్యవస్థను మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విద్యా రాజగోపాలన్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

సి ని మా లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేష్ - సత్యం సుందరం
రామలక్ష్మి- దేవర,
లత - దేవర, సప్తగిరి- దేవర
మహారాజ్ (ఆనందపురం) - దేవర

సబ్‌రిజిస్ట్రార్‌గా చక్రపాణి బాధ్యతల స్వీకరణ



మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ కార్యాలయంలో సబ్‌రిజిస్ట్రార్‌గా వి.చక్రపాణి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్.మోహనరావు బదిలీపై పార్వతీపురానికి వెళ్లారు. నగరంలోని ఐజీ కార్యాలయం నుంచి చక్రపాణి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

భీమిలి

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: రుషికొండ ప్రభుత్వ పాఠశాల వెనుక డోర్ నంబరు 9-65 గల ప్రాంతంలో రోడ్డు గోతులమయంగా ఉంది. - స్థానికులు, రుషికొండ

సమాధానం: త్వరలో రోడ్డు మరమ్మతు చర్యలు చేపడతాం. - సింహాచలం, జోన్-2 కమిషనర్

సమస్య: ఆనందపురం పూల మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్‌తో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. - రాజారావు, ఆనందపురం

సమాధానం: ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూస్తాం. - ఆనందపురం, ట్రాఫిక్ పోలీసులు

మేమున్నాం.. మీకు తోడుగా

80086 11711, 99122 22247

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సమస్య: శివాలయం (సాగర్‌నగర్) నుంచి తాటిచెట్లపాలెం రోడ్డు పక్కన కాలువల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - శివశంకర్, తాటిచెట్లపాలెం

సమాధానం: క్షేత్ర స్థాయిలో పరిశీలించి సరిచేసి చర్యలు తీసుకుంటాం. - సింహాచలం, జోన్-2 కమిషనర్

ఉచిత గ్యాస్‌తో.. తగ్గనున్న వంటింటి భారం

దీపావళి నుంచి ఏడాదికి మూడు సిలిండర్లు

మహిళలకు వంటింటి భారం తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతోంది. ఈ క్రమంలోనే మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని దీపావళి రోజు ప్రారంభం చేస్తున్నట్లు ఇటీవల సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లు రాష్ట్రాన్ని సంక్షోభంలో నెట్టేసినా.. ఆయా సవాళ్లను ఎదుర్కొని ప్రజలకు మంచి చేసేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు.



మధురవాడ, పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రజలకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన చేయడంతో భీమిలి నియోజకవర్గంలోని గ్రామీణ మండలాలు, వార్డుల వారీగా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీపావళి పండుగ నాడు ఈ పథకాన్ని ప్రారంభిస్తామని చెప్పడంతో వారి సంతోషానికి అవధుల్లేవు. ఒక గ్యాస్ సిలిండర్ ధర రూ.811 ఉంది. కేంద్ర ప్రభుత్వం రూ.10.62 రాయితీ అందిస్తోంది. నలుగురు కుటుంబ సభ్యులు ఎంత పొదుపుగా వాడినా రెండు నెలలకు ఒకటి చొప్పున ఏడాదికి 6 సిలిండర్లు అవసరమవుతాయి. ఇందులో కూటమి ప్రభుత్వం ఏకంగా మూడు సిలిండర్లు ఉచితంగా అందించనుంది. దీంతో ఆయా కుటుంబాల వంటింటిపై ఆర్థిక భారం తగ్గినట్లే. ఈ లెక్కన ఒక్కో ఇంటికి ఏడాదికి సగటున రూ.2,433 ఆదా అవుతుంది.

మరింత నమ్మకం పెరిగింది



గ్యాస్ సిలిండర్ల కొనుగోలు విషయంలో ప్రతి ఇంటికి ఆర్థిక భారం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ పథకం అమలు చేయడం సంతోషంగా ఉంది. దీపావళి నుంచి మూడు సిలిండర్లు ఇస్తామని ప్రకటించడంతో సీఎం చంద్రబాబుపై మరింత నమ్మకం పెరిగింది. - వి.వరలక్ష్మి (వాంబేకాలనీ)

మధ్య తరగతి ప్రజలకు మేలు



ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంతో మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. పొదుపుగా నడుపుతున్న చిన్న కుటుంబాలకు ఏడాదికి మూడు సిలిండర్లు సరిపోతాయి. దీంతో వంటగ్యాస్ రూపేణా ఎలాంటి ఆర్థిక భారం ఉండదు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజుల్లోనే ఈ పథకం అమలు చేయనుండటం గర్వనీయం. - ఎం.హరిదేవి, (వికలాంగులకాలనీ)

గృహిణుల ఆనందం



ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. వంటింటి భారం తగ్గుతుందని గృహిణిలుంతా సంతోషపడతాం. గ్యాస్ కోసం వినియోగించే నగదును మరో అవసరానికి వాడుకుంటాం. - పెంటకోట బబ్బేలు (ఆర్‌హెచ్‌కాలనీ)

పాఠశాలలో విద్యుత్ సామగ్రి దొంగతనం

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యుత్ సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు ఆరిలోవ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం శైలజ తెలిపారు. శుక్రవారం ఉదయం పాఠశాల తలుపులు తీసేసరికి రెండో అంతస్తులో ఫ్యాన్లు, లైట్లు సంబంధిత వైర్లు అపహరణకు గురయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు. మూడు రోజులు క్రితం సమీప గుడ్లవానిపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలోనూ దొంగలు పడిన విషయం తెలిసిందే.

వారపు సంత.. కొమ్మాది రహదారికి తరలింపు

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 కార్యాలయం సమీప సేవా రహదారిలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న సంతను కొమ్మాది మాస్టర్‌ప్లాన్ రహదారికి తరలిస్తున్నట్లు జీవీఎంసీ, పోలీసు యంత్రాంగం తెలిపింది. ఇందుకు చిరు వర్తకులు, ప్రజలు సహకరించాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం ఏడీసీపీ ట్రాఫిక్ కె.ప్రవీణ్‌కుమార్, జోన్-2 జెడ్సీ పి.సింహాచలం, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి శబ్నాన్, పీఎంపాలెం ట్రాఫిక్ సీఐ ఎస్.కాంతారావు, రెవెన్యూ ఆర్వో శివకుమార్‌లు తమ బృందంతో కలిసి కొమ్మాది మాస్టర్‌ప్లాన్ రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా చంద్రంపాలెం ఉన్నత పాఠశాల నుంచి జీవీఎంసీ జోన్-2 కార్యాలయం చివర వరకు సేవా రహదారిని ఆక్రమించి సంతను నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందన్నారు. అందువల్ల శనివారం సంతకు వచ్చే చిరు వర్తకులంతా కొమ్మాది రహదారి పక్కనున్న ఖాళీ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ప్రసాద్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, జీవీఎంసీ అధికారులు

మందుబాబులకు జరిమానా

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 13 మందిపై నమోదైన కేసుల ఆధారంగా అబ్కారీ విభాగం ప్రత్యేక జ్యుడీషియల్ న్యాయమూర్తి శుక్రవారం జరిమానాలు విధించారని ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.12 వేలు.. టి.గోపాలకృష్ణకి మూడు రోజుల జైలు శిక్ష, రూ.50 జరిమానా విధించారన్నారు.

సెక్యూరిటీ మేనేజర్ అదృశ్యం



కోలా శ్యామ్ (పాతచిత్రం)

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ప్రైవేటు సెక్యూరిటీ మేనేజర్ అదృశ్యమైనట్లు గురువారం పీఎంపాలెం స్టేషన్ సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. కొమ్మాది దరి సేవానగర్ కాలనీకి చెందిన కోల శ్యామ్ (49) జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రయివేటు సెక్యూరిటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 24న ఎప్పటిలాగే ఉదయం విధులకు ఇంటి నుంచి వెళ్లారు. రాత్రి తిరిగి రాకపోవడంతో తన భార్య ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో చుట్టు పక్కల, బంధువుల నివాసాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. పనోరమహిల్స్ రోడ్డులో గంజాయి విక్రయం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై కె.భాస్కర్, హెచ్‌సీ, సిబ్బందితో కలిసి నిఘా పెట్టారు. శ్రీకాకుళం జిల్లా బలగ ప్రాంతానికి చెందిన హనుమంతు జగదీష్ (23), మిధిలాపురి వుడా కాలనీ ఇనుగంటి శ్రీకాంత్ (37) ఇద్దరూ రోడ్డు పక్కన నిర్మానుష్య ప్రాంతంలో ద్రవరూప గంజాయి తాగుతుండగా పట్టుకున్నారు. రూరల్ తహసీల్దార్ ముందు హాజరుపర్చి తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ సంచిలోని ఎండిన గంజాయి ఆకులు 200 గ్రాములు, కారు, ద్విచక్రవాహనం స్వాధీన పర్చుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: మధురవాడలో ఐటీఐ చదువుతున్న దివ్యాంగ విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందాడు. దీనిపై పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కైలాసపురం ప్రాంతానికి చెందిన దొడ్డ జానకీరామ్ బక్కన్నపాలెం సమీపంలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, శిక్షణ, ఉత్పత్తి కేంద్రంలో ఐటీఐ (పెయింటింగ్) మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అనారోగ్యం (జ్వరం) కారణంగా ఈ నెల 24న ఇంటికెళ్లి తిరిగి గురువారం వచ్చాడు. రాత్రి భోజనం చేశాక వాంతి చేసుకోవడంతో కేజీహెచ్‌కి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తరచూ పీఎంపాలెం స్టేషన్ పరిధి నుంచి ఫిర్యాదులు

సీపీ శంఖబ్రత బాగ్చీ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నగరంలో గంజాయి మత్తును నిర్మూలించేందుకు త్వరలో పోలీసు సిబ్బందికి టెస్టింగ్ కిట్లు అందించి నిరంతర తనిఖీలు చేపడతామని సీపీ శంఖబ్రత బాగ్చీ అన్నారు. పీఎంపాలెం పోలీసుస్టేషన్‌లో శుక్రవారం సీపీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం శాంతిభద్రతల విభాగంలో కేసులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించి సీఐ, ఎస్సైలకు పలు సూచనలు చేశారు. 2014 నుంచి ఇప్పటి వరకు స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసులను సుదీర్ఘంగా పరిశీలించారు. సుమారు 8 గంటలు ఇక్కడే ఉన్నారు. సీపీ మాట్లాడుతూ.. తాను విధుల్లో చేరిన తర్వాత పీఎంపాలెం స్టేషన్ పరిధి నుంచి తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీంతో ఇక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని తెలిపారు. మొత్తం 8 పోలీసు బృందాలు ఏ ఒక్క ప్రాంతం వదలకుండా నిఘా కొనసాగిస్తున్నాయన్నారు. ప్రధానమైన, సమస్యాత్మక ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు. నగరంలో ఎక్కడా రౌడీ షీటర్ల ఉనికి లేకుండా చేస్తున్నామన్నారు. పీఎంపాలెం స్టేషన్‌లో సివిల్ తగాదాల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతుందన్నారు. నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. నేర విభాగం డీసీపీ-1 అజిత వేజెండ్ల, ఉత్తర సబ్‌డివిజన్ ఏసీపీ ఎస్.అప్పలరాజు, సీఐ జి.బాలకృష్ణ, ఎస్సైలు కె.భాస్కర్, సునీత తదితరులు పాల్గొన్నారు. అయితే ప్రధాన కేసు నిమిత్తం ఈ తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం.



పోలీసుస్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

వైభవంగా అప్పన్న స్వామి నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం శుక్రవారం సింహగిరిపై వైభవోపేతంగా జరిగింది. వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం దేవతా మూర్తుల పరిణయోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

నవరాత్రి ఉత్సవాలకు ఉడుపురాట

మధురవాడ, న్యూస్‌టుడే: 5, 7 వార్డులలోని స్వతంత్రనగర్ లక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షులు వాసుపిల్లి బండియ్య పర్యవేక్షణలో శుక్రవారం ఉడుపురాట కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు పి.గౌరీప్రసాద్‌శర్మ వేదమంత్రాల నడుమ కమిటీ కార్యదర్శి బాలుపాత్రో దంపతులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. కోశాధికారి కె.శ్రీను, కార్యనిర్వాహక కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, డి.గౌరీశంకర్, ఎ.నాగరాజు, బి.జగన్, కె.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

గ్రామీణభీమిలి: భీమిలి గ్రామీణ మండలంలోని సింగనబంద గ్రామ పంచాయతీలో కేంద్ర విజిలెన్స్ బృందం శుక్రవారం ఉదయం పర్యటించింది. సునీల్ గైక్వాడ్, అగార్కర్‌లతో కూడిన బృందం కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుతీరును పరిశీలించారు. ఉపాధి హామీ పథకం, సామాజిక భద్రత పింఛన్లు, గృహనిర్మాణ పథకం, వాటర్‌షెడ్ కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం మజ్జిపేట గ్రామ సచివాలయానికి వెళ్లి అక్కడ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమావేశమయ్యారు. భీమిలి మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎన్.హనుమంతురావు, పంచాయతీ విస్తరణాధికారి జి.అప్పలరాజు, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు బి.రంగారావు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

చినుకుతో వణుకు

కొమ్మాది, న్యూస్‌టుడే: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కొమ్మాది, మారికవలస, మధురవాడ ప్రాంతంలో రహదారులు జలమయమయ్యాయి. శారదానగర్, సాయిరాం కాలనీ, వికలాంగులకాలనీ, కార్పెంటర్స్ కాలనీ తదితర కొండవాలు ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగం కార్మికులు పలుచోట్ల పేరుకున్న చెత్తను తొలగించేందుకు శ్రమిస్తున్నారు.



కాలువలో చెత్తను బయటకు తీస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మళ్లీ మొదలైన అక్రమ నిర్మాణం

కొమ్మాది, కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-2 పరిధి 6వ వార్డులో సాయిప్రియ గార్డెన్స్ లే-అవుట్ నుంచి బక్కన్నపాలెం వైపు వెళ్లే వీఎంఆర్డీఏ బృహత్తర ప్రణాళిక రహదారికి ఆనుకుని ఏడేళ్ల కిందట ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ బహుళ అంతస్తు నిర్మాణం మళ్లీ తెరపైకి వచ్చింది. సర్వే సంఖ్య 66/3 సబ్ డివిజన్‌లో జీప్లస్+4 నిర్మాణాన్ని చేపట్టారు. ఆ నిర్మాణాన్ని ప్రభుత్వ స్థలంలో నిర్మించారని 2018 ఆగస్టులో 'ఈనాడు'లో పలు కథనాలను ప్రచురించడంతో అప్పటి కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, కమిషనర్ ఎం.హరినారాయణ్ స్పందించి పూర్తిస్థాయి విచారణ చేపట్టారు. 239 గజాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేపట్టినట్లు సంబంధిత అధికారులు నివేదికను అందించారు. దాని ఆధారంగా అప్పట్లో నిర్మాణానికి అనుమతులు ఇచ్చిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులపై పోలీసు కేసులు నమోదు చేయించి దర్యాప్తు సైతం చేపట్టి నిర్మాణాన్ని నిలుపుదల చేయించారు. మళ్లీ అదే నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు వారం రోజులుగా పనులు చేపట్టారు. ఈ విషయాన్ని స్థానికులు జీవీఎంసీ జోన్-2 పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు తెలియజేయడంతో స్థానిక సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ శుక్రవారం అక్కడకు చేరుకుని నిర్మాణ పనులు నిలుపుదల చేయాలని కోరారు. భవన నిర్మాణ అనుమతుల అంశం న్యాయస్థానంలో ఉందని, దానికి సంబంధించిన పత్రాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని బదులిచ్చారు. నిర్మాణం నిలుపుదల చేయాలని చెప్పినందుకు తనకు సైతం నోటీసులిచ్చారని జీవీఎంసీ ప్లానింగ్ సెక్రటరీ కవిత తెలిపారు. ఈ విషయంపై జోన్-2 పట్టణ ప్రణాళిక సహాయ ప్రణాళికాధికారి శాస్త్రి శబ్నాన్‌ను వివరణ కోరగా నిర్మాణానికి సంబంధించిన పత్రాలను న్యాయస్థానంలో సమర్పిస్తామని, ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతామన్నారు. అక్రమంగా చేపడుతున్న నిర్మాణానికి సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు జీవీఎంసీ అధికారులకు అందినా.. వాటిని పట్టించుకోకపోవడంతోనే దర్జాగా నిర్మాణం చేస్తున్నట్లుంది. ప్రణాళికాధికారుల బదిలీల సమయాన్ని చూసి నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నారన్న అనుమానాలున్నాయి. 2018 నుంచి ఇప్పటి వరకు జీవీఎంసీ అధికారులు ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకునేలా భవనాన్ని కూల్చివేయడమో, నిర్మాణదారుతో చర్చలు జరిపి, స్థలానికి లెక్క కట్టి నిధులు వసూలు చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం విశేషం.



రంగులు వేసి అమ్మకానికి సిద్ధం చేస్తున్న బహుళ అంతస్తు భవనం

రెవెన్యూ బృందం క్షేత్రస్థాయి పరిశీలన

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ అయిదో వార్డు పరిధి మారికవలస గ్రామ సమీపంలోని ఓ లే-అవుట్‌కు, గెడ్డవాగుకు మధ్యలో ఉన్న స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారన్న ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ పాల్‌కిరణ్ ఆదేశాలతో స్థానిక సచివాలయ వీఆర్వో యువరాజ్, మండల సర్వేయర్ శ్రీనుబాబు, రమణ ఆ స్థలాన్ని శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరదేశిపాలెం సర్వే సంఖ్య 110/పిలో వీఎంఆర్డీఏ లే-అవుట్‌కు చెందిన స్థలంలో ఈ నిర్మాణం చేపడుతున్నారని.. అయితే చివరి రెండు ప్లాట్ల నెంబర్లు లే-అవుట్‌లో వేయకపోవడంతో ఆ స్థలం దేనికి విడిచిపెట్టారో తెలియడం లేదన్నారు. అందుకు వీఎంఆర్డీఏ అధికారులను నివేదిక కోరతామన్నారు. అప్పటి వరకూ అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. అంతేగాక దానికి ఆనుకొని సర్వే సంఖ్య 94 ఉందని.. అది గెడ్డ వాగు అని వెల్లడించారు. అందుకే పూర్తిస్థాయిలో నివేదిక తీసుకుని ఆ స్థలాన్ని సైతం సంరక్షించే బాధ్యతలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

అనాథలకు ఎన్టీఆర్ అభిమానుల ఆర్థికసాయం

తగరపువలస, న్యూస్‌టుడే: మజ్జివలస ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ గాజువాకలోని డిజైర్ అనాథ బాలల సొసైటీకి శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. దేవర చిత్రం విడుదల సందర్భంగా రూ.10 వేలు అందించారు. రౌతు చంటి, గోవింద పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

చిట్టివలస(తగరపువలస): పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తగరపువలస బంగ్లామెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ భీమిలి ప్రాజెక్టు అధికారిణి శ్రీదేవి, సూపరువైజరు ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: యువత వినూత్న ఆలోచనల్ని పెట్టుబడిగా పెట్టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గీతం డీమ్డ్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు సూచించారు. భారత ప్రభుత్వ విద్యాశాఖ, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సంయుక్తంగా వాధ్వాని ఫౌండేషన్ సహకారంతో గీతం వేదికగా అయిదు రోజులపాటు నిర్వహించిన 'ఇన్నోవేషన్, డిజైన్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (ఐడీఈ) బూట్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలుగా మారాలనుకునేవారికి సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం, ఓపిక, కష్టపడేతత్వం అవసరమన్నారు. ✶ ఏఐసీటీఈ దక్షిణ ప్రాంత అధికారి భీమారెడ్డి మాట్లాడుతూ యువతలో వచ్చే ఆలోచనల్ని స్టార్టప్‌ల దిశగా ఏ విధంగా మలచుకోవచ్చునో నిపుణుల ద్వారా అవగాహన కల్పించామన్నారు. శిబిరానికి హాజరైన విద్యార్థి బృందాలకు ధ్రువపత్రాలను వక్తలు అందజేశారు.



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గౌతమ్‌రావు

క్రీడాపోటీల్లో విద్యార్థుల రాణింపు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ఆవాస విద్యాలయం (ఎన్.ఎస్.సి.బి) విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పలు పతకాలను కైవసం చేసుకున్నారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో ఈనెల 23న జరిగిన పోటీల్లో ఎన్ఎస్‌సీబీ విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని రాణించారు. ఈ సందర్భంగా శుక్రవారం విద్యాలయంలో పాఠశాల ప్రత్యేకాధికారి (ఎస్.ఓ) బి.మంగపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను అభినందించారు. కార్యక్రమంలో సమగ్రశిక్షా పథకం ఏపీసీ బి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, హెచ్.ఎం. ఎం.శివలక్ష్మి, పి.ఇ.టి. వై.దండు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఎన్.ఎస్.సి.బి. నిర్వాహకులు

అగ్నిప్రమాద బాధితులకు సాయం

తగరపువలస: దాకమర్రి పంచాయతీ అల్లుపేటకి చెందిన అగ్నిప్రమాద బాధితులకు తెదేపా మండల కమిటీ శుక్రవారం సాయం చేసింది. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు డీఏఎన్ రాజు, ఉపాధ్యక్షుడు సంకురుభక్త ప్రకాశ్ చేతులమీదుగా బియ్యం బస్తాలు, నిత్యావసరాలను అందించారు. భీమిలి మాజీ జడ్పీటీసీ సభ్యులు సరగడ అప్పారావు, మాజీ సర్పంచులు అల్లు అప్పలనాయుడు, చిన్నయ్య, చెల్లూరి కృష్ణ, చెల్లూరి నాని పాల్గొన్నారు.

పద్మనాభం తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పద్మనాభం, న్యూస్‌టుడే: పద్మనాభం మండల తహసీల్దార్‌గా ఆనందరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలలు క్రితం నియమితులైన ఎం.ఆనంద్‌కుమార్ బదిలీపై పెందుర్తి వెళ్లగా ఆయన స్థానంలో స్థానంలో ఆనందరావు ఇక్కడికి వచ్చారు. డి.టిగా కె.చంద్రశేఖర్ సైతం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరితో పాటు మండలానికి కొత్తగా ఏడుగురు వి.ఆర్.ఒలు బదిలీపై వచ్చారు.

ఓక్రిడ్జ్‌లో గ్లోబల్ వర్సిటీ ఫెయిర్

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస సమీప భీమిలి మండలం సింగనబందలోని ఓక్రిడ్జ్ అంతర్జాతీయ పాఠశాలలో గ్లోబల్ యూనివర్సిటీ ఫెయిర్ శుక్రవారం జరిగింది. ప్రిన్సిపల్ శైలా భమిడిపాటి, డైరెక్టర్ అమిత్ జైన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇండియా, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, చైనా, యూరప్, సింగపూరు, కెనడా, తదితర దేశాల్లోని 60 ప్రఖ్యాత వర్సిటీలు వచ్చాయన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కేటిన్‌పేట సెయింట్ పీటర్స్ చర్చి ప్రాంగణంలో ఒన్ రియాల్టీ గ్రూప్ ఆధ్వర్యంలో అనిల్ నీరుకొండ ఆసుపత్రి వైద్యుల సహకారంతో శుక్రవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యులు సుమారు 150 మందికి వివిధ పరీక్షలు చేశారు. ఒన్ రియాల్టీ గ్రూప్ సి.ఇ.ఓ. కె.సురేష్‌బాబు మాట్లాడుతూ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని పేర్కొన్నారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

అవయవదానం.. ఇతరుల జీవితాలకు వెలుగు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: అవయవదానం ద్వారా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చునని శరీర అవయవదాతల సంఘం, సావిత్రీబాయి పులే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డా.గూడూరి సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. భీమిలి సన్‌స్కూలు ఆవరణలో భీమిలి నీడి వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అవయవదానంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. నీడి వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సభ్యులు కె.సన్నీ, ఎం.సూర్యశ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు జి.కన్యాకుమారి, ఐ.సురేఖ పాల్గొన్నారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

'స్వర్ణాంధ్ర-2047' గోడపత్రిక ఆవిష్కరణ

భీమునిపట్నం, న్యూస్‌టుడే: వికసిత్ భారత్‌లో భాగంగా 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రగా మార్చేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాల ప్రధానాచార్యులు ఎం.జ్యోతికుమారి కోరారు. భీమిలి డైట్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు రూపొందించిన స్వర్ణాంధ్ర- 2047 గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు జ్యోతికుమారి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో స్వర్ణమయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతీ ఒక్కరూ చేయూతనందించాలని పేర్కొన్నారు. అధ్యాపకులు జి.జి.ఎస్.నాగేశ్వరరావు, గొట్టేటి రవి, డా.ఆర్.నీలిమ, పి.హరిణి, విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు పంపిణీ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: జీవీఎంసీ ఒకటో వార్డులోని చిట్టివలస జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు జనసేన వార్డు అధ్యక్షురాలు పరిమి భువనేశ్వరి శుక్రవారం కంచాలను పంపిణీ చేశారు. మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ, ఎంఎఫ్‌సీ సంస్థల అధినేత ఆదిమూలం నాగరాజు, సత్యనారాయణ సోదరుల ఆర్థికసాయంతో సుమారు 100 కంచాలను అందించామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రోజామణి, జనసేన నాయకులు ప్రీతం, తమ్మిన అశోక్, మాకాల ప్రసాద్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

గీతంలో బోస్ స్టాటిస్టిక్స్‌పై కార్యశాల

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: భౌతిక శాస్త్ర రంగంలో ప్రపంచ ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ వందేళ్ల క్రితం పరిశోధించిన బోస్ స్టాటిస్టిక్స్‌పై గీతం డీమ్డ్ వర్సిటీలో శుక్రవారం ప్రత్యేక కార్యశాల నిర్వహించారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ గీతం ఆయా విభాగం, సత్యేంద్రనాథ్ బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ (కోల్‌కతా) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వివిధ రంగాల్లో బోస్ స్టాటిస్టిక్స్ ప్రాధాన్యతను బాబా అణుశక్తి పరిశోధనా కేంద్రం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం తదితర సంస్థల శాస్త్రవేత్తలు ఆచార్యులు బి.ఎన్.జగతాప్, అశోక ఎన్.ఉదయగిరి, మణిక్‌బనిక్, తిరుపతయ్యశెట్టి వివరించారు. ✶ గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపల్ ఆచార్య కె.వేదవతి, ఆచార్య జి.రవికుమార్ ప్రసంగించారు. అనంతరం శాస్త్రవేత్తల్ని సత్కరించారు. వివిధ కళాశాలలకు చెందిన భౌతిక శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాస్త్రవేత్తను సత్కరిస్తున్న డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణ

విశాఖ తూర్పు



ఎం.జి.ఎం డైరెక్టర్ రాజగోపాలన్‌తో ఆసుపత్రి వైద్యులు

ఎం.జి.ఎం పేరుతో సెవెన్‌హిల్స్ సేవలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: సెవెన్‌హిల్స్ ఆసుపత్రి ఇక నుంచి ఎం.జి.ఎం హెల్త్‌కేర్ సెవెన్‌హిల్స్ ఆసుపత్రిగా సేవలందిస్తుందని ఎం.జి.ఎం సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్ తెలిపారు. సిరిపురంలో ఓ హోటల్లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వింగ్ కమాండర్ సి.ఇ.వో ఎంకే జోస్ సమక్షంలో నూతన లోగోను ఆవిష్కరించారు.

భయం భయంగా... బతుకులు

ఆరిలోవ, న్యూస్‌టుడే: పెదగదిలి కొండ మీద నివాసాలు ఏర్పరుచుకున్న కుటుంబాలు భయం భయంగా కాలం గడుపుతున్నారు. గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతం పూర్తిగా నానిపోవడంతో మట్టి పెళ్లలు జారి పడతాయేమోనని స్థానికులు తెలిపారు. ఆయా ప్రాంతాలను గుర్తించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని పెదగదిలి కొండ ప్రాంతం, ఈశ్వరదేవినగర్, వినాయకనగర్, సింహగిరి కాలనీలలో నివాసం ఉంటున్న స్థానికులు కోరుతున్నారు. కొండ మీద దేవస్థానం నిర్మించిన సిస్టేవాలేలి సమీపంలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న స్థానికులు భయం భయంగా కాలం గడుపుతున్నారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: హనుమంతువాక నుంచి దీనదయాళ్‌పురం వరకు కొండవాలు వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గతనెలలో కురిసిన వర్షాలకు పలుచోట్ల కొండమట్టి జారిపడి ఇళ్లపైకి వచ్చేసింది. మళ్లీ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ఎప్పుడు ఏ సమస్య వస్తుందోనని హడలి పోతున్నారు. ఆపదొచ్చిన చోట్ల రక్షణ గోడలు నిర్మించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పెదగదిలి కొండపై మట్టి జారడానికి అవకాశం ఉన్న ప్రాంతం

క్రీడా మైదానాల్లో మొక్కలు పెంచాలి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడా మైదానాల్లో మొక్కలు విరివిగా పెంచాలని ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి పేర్కొన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలోని క్రీడా మైదానం చుట్టూ ఎం.పి.ఇ.డి విద్యార్థులు స్వయంగా మొక్కలు తెచ్చి శుక్రవారం నాటారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని పోషించి చెట్లుగా పెరిగే వరకు సంరక్షించాలన్నారు. తొలి రోజు 40 మొక్కలు నాటారు.



మొక్కలు నాటుతున్న ఆచార్య పల్లవి, విద్యార్థులు

30న పోలీసు దుకాణం బహిరంగ వేలం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనరేట్‌కు చెందిన దుకాణాన్ని బహిరంగ వేలం వేస్తున్నట్లు ఏడీసీపీ(పరిపాలన) ఒక ప్రకటనలో తెలిపారు. కేజీహెచ్ డౌన్‌లోని రక్ష షాపింగ్ కాంప్లెక్సులోని దుకాణం నెంబరు 25ను ఈ నెల 30న బహిరంగ వేలం ద్వారా లీజుకు ఇస్తారన్నారు. ఆసక్తిగల వారు సోమవారం ఉదయం 11 గంటలకు పోలీసు బ్యారెక్సు దరి సమావేశమందిరంలో హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుకోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. కనీసం చదవడం, రాయడం వచ్చా.. రాదా.. అన్న విషయంపై ప్రభుత్వం అమలు చేస్తున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్.ఐ.పి) పేరుతో శుక్రవారం బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఈస్టుపాయింట్ కాలనీ కేడీపీఎం స్మార్ట్‌సిటీ ఉన్నత పాఠశాలలో బేస్‌లైన్ టెస్ట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. డీఈవో చంద్రకళ, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఎ.ఎం.వో లక్ష్మి పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు ఏమేరకు పరీక్షలు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పాఠశాల హెచ్.ఎం.సుమతి బాయి అధికారులకు వివరించారు.

పొంగిన గెడ్డలు.. రహదారులు జలమయం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తూర్పులో రహదారులు జలమయమయ్యాయి. ఎంవీపీకాలనీలో పలు గెడ్డలు పొంగి ప్రవహించాయి. ప్రధానంగా ఆళ్వార్‌దాస్ కూడలిలో వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో పాటు పలు సెక్టార్లలో కాలువలు లేక పోవడంతో వర్షపునీరు వీధుల్లోనే నిలిచిపోయి ఉంది. సీత కొండ వద్ద కొండ చరియలు విరిగిపడ్డాయి. కాలువలపై ఆక్రమణలు తొలగించి రహదారులను అభివృద్ధి చేస్తే వర్షపు నీరు నిలిచే అవకాశం ఉండదని, ఆ దిశగా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు రహదారులన్నీ జలమయం అయ్యాయి. ఆరిలోవ ప్రాంతంలో ఉన్న లోతట్టు ప్రాంతాలన్నీ వర్షపు నీటితో నిండిపోయాయి. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తెరిపిచ్చిన వర్షం, మరల సాయంత్రం 3 గంటల నుంచి దట్టమైన మేఘాలు ఆవరించి వర్షం కురిసింది. కొండవాలు ప్రాంతాల్లో ఉన్న వారు కొన్ని ప్రాంతాల్లో కొండ చరియలు జారి పడతాయేమోనని భయపడ్డారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నగరంలో శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురవటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విశాలాక్షినగర్ ప్రధాన రహదారి, హనుమంతువాక కూడలి, జోడుగుళ్లపాలెం ఆటోస్టాండ్, కైలాసగిరి కూడలి నుంచి ఏఆర్ పోలీస్ స్టేడియం గేటు వరకు వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆళ్వార్‌దాస్ కూడలిలో నిలిచిన వర్షం నీరు



ఎంవీపీ సెక్టారు-2లో ప్రవహిస్తున్న గెడ్డ



ఎంవీపీ వీధుల్లో ..



పెదగదిలి అంబేడ్కర్ కూడలి జలమయం



సెక్టారు-6 వీధిలో..

బదిలీపై వెళ్తున్న కీర్తికి సన్మానం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో వి.ఎం.ఆర్.ఎ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న దాట్ల కీర్తి విజయనగరం జిల్లా ఆర్.డి.వోగా బదిలీ అయ్యారు. ఈమేరకు సిరిపురం వి.ఎం.ఆర్.డి.ఎ కార్యాలయంలో కీర్తిని సంస్థ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఘనంగా సన్మానించారు. శాలువ కప్పి, పూలబొకే అందజేశారు. సంయుక్త కమిషనర్ రమేష్, ముఖ్యప్రణాళిక అధికారి శిల్ప, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్యగణాంక అధికారి హరిప్రసాద్, ప్రధాన ఇంజినీర్ భవానిశంకర్, డి.ఎఫ్.వో శాంతిస్వరూప్ పాల్గొని ఆమెను ఘనంగా సన్మానించారు.



ఆర్డీవోగా బదిలీ అయిన కీర్తిని సన్మానిస్తున్న వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ విశ్వనాథన్

రెక్టార్ ఆకస్మిక తనిఖీలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూ రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా వర్సిటీలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, న్యూక్లాస్ రూమ్ కాంప్లెక్స్ విభాగాల్లో పర్యటించారు. విద్యార్థులకు బోధన జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా తిలకించారు. అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. విభాగాలకు పూర్తి స్థాయి మౌలిక వసతులు సమకూర్చాలని విభాగాధిపతులకు సూచించారు. ఆయన వెంట కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మెస్‌లను మధ్యాహ్న భోజన సమయంలో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించారు.



కంప్యూటర్ సైన్స్ విభాగంలో దస్త్రాలు తనిఖీలు చేస్తున్న రెక్టార్ ఎన్.కిశోర్‌బాబు, కమిటీ సభ్యులు

జేసీఐ సర్వసభ్య సమావేశం

హెచ్‌బికాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: సమాజాభివృద్ధి కోసం భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వైజాగ్ అచీవర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బొత్స దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. మద్దిలపాలెంలో శుక్రవారం జేసీఐ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో విజయ్‌కిరణ్, రాజేష్, వంశీభూషణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జేసీఐ ప్రతినిధులు

సంక్షేమ కార్యక్రమాలపై ప్రచారం

ఆరిలోవ, న్యూస్‌టుడే: 'ఇది మంచి ప్రభుత్వం' ప్రచార కార్యక్రమంలో భాగంగా జైభీమ్‌నగర్, శివాజినగర్, శ్రీకాంత్‌నగర్ జెఎన్ఎన్‌యుఆర్ఎం బ్లాక్స్‌లో శుక్రవారం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ కార్యక్రమాలు అందని వారి వివరాలు సేకరించారు. వార్డు అధ్యక్షులు పొత్రకొండ ధర్మారావు ఆధ్వర్యంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యల్లమిల్లి సురేష్, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏయూ సహకార సంఘం అధ్యక్షుడిగా యుగంధర్

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉద్యోగుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఆచార్య ఎన్.ఎం.యుగంధర్ ఎన్నికయ్యారు. సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు, ఏయూ ఉద్యోగులు, సహకార సంఘం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఆచార్య ఎన్.ఎం.యుగంధర్‌తో డైరెక్టర్ల బృందం

సంక్షేమ వసతిగృహాల్లో ఆహార నాణ్యతపై దృష్టి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహాల పనితీరు సంతృప్తికరంగా ఉందని ఆశాఖ సంచాలకులు బి.లావణ్య వేణి కితాబునిచ్చారు. జిల్లా కలెక్టర్ విచక్షణ నిధుల కింద రూ.5 కోట్లను వసతిగృహాల పునరుద్ధరణకు కేటాయించడంపై కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎంవీపీ-1 సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహం, జైలు రోడ్డు వద్ద గల బాలికల వసతిగృహాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతిగృహాల్లో సదుపాయాలు, మెనూ అమలు, నాణ్యతను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఆహార నాణ్యతపై దృష్టి పెట్టాలని, ముఖ్యంగా కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆవరణలో పూల మొక్కలు, కూరగాయల మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం సిరిపురం దరి శాఖకు చెందిన స్థలాన్ని పరిశీలించారు. కాస్మొటిక్ ఛార్జీలు, బయోమెట్రిక్ పరికరాల సరఫరా, డైట్ ఛార్జీల పెంపు అంశాలపై వసతిగృహ సంక్షేమశాఖ అధికారుల సంఘం ప్రతినిధులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. రామారావు, సహాయ సంక్షేమాధికారులు శ్యామల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న సాంఘిక సంక్షేమ సంచాలకులు లావణ్య వేణి

విద్యార్థుల మెగా రక్తదానం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ జయంతి సందర్భంగా భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో ఏయూ టి.ఎల్.ఎన్.సభాహాలులో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 80 మంది రక్తదానం చేశారు. ఎస్.ఎఫ్.ఐ. జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు మాట్లాడుతూ భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువతరం ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎస్.ఎఫ్.ఐ. జిల్లా అధ్యక్షుడు జి.రాము, యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.వెంకటరమణ, కార్యదర్శి ఆర్.హర్షిత్, జిల్లా ఉపాధ్యక్షుడు జి.అజయ్, బి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వైశాఖి నృత్యోత్సవాలు ప్రారంభం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగే వైశాఖి నృత్యోత్సవాలు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పశ్చిమబెంగాల్, ఒడిశా కళాకారులు పాల్గొని మణిపురి, సంబల్‌పురి నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రముఖ భరతనాట్య కళాకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రతిభాప్రహ్లాద్ నాట్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈమెకు వైశాఖి జీవన సాఫల్య పురస్కారం-2024ను నిర్వాహకులు ప్రదానం చేశారు. కళాభారతి నిర్వాహకుడు ఎం.ఎస్.ఎన్.రాజు, కార్యక్రమం నిర్వాహకుడు విక్రమ్‌గౌడ్, ఆదాయపన్ను శాఖ సహాయ సంచాలకులు శంకర్ పాండే, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభాప్రహ్లాద్‌కు పురస్కారం అందజేస్తున్న ఎం.ఎస్.ఎన్.రాజు, విక్రమ్‌గౌడ్ తదితరులు

ఘనంగా రాట మహోత్సవాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: 28 వార్డు పరిధిలోని రామ్‌నగర్‌లో శుక్రవారం ఉదయం విజయదశమిని పురస్కరించుకొని రాటమహోత్సవం నిర్వహించారు. కె.ఎన్.ఆర్ కూల్‌గైస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు సారిపల్లి రమేష్, నక్కా కనకరాజు, అప్పల నారాయణ, యువకులు పాల్గొన్నారు.

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెంలో శ్రీకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గాదేవి అమ్మవారి రాట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితుల నేతృత్వంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: 13వ వార్డు పరిధి పైనాపిల్ కోలనీలో ఉన్న జెఎన్ఎన్‌యుఆర్ఎం బ్లాక్స్ దగ్గర అక్టోబరు 3 నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రుల సందర్భంగా దేవి మండపం నిర్మించేందుకు శుక్రవారం ఉడుపు రాట ఉత్సవం జరిగింది. పూజ ప్రాంగణంలో హోమం, రాట వేయడం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెదేపా యువ నాయకుడు వెలగపూడి ప్రతాప రుద్ర, వార్డు తెదేపా అధ్యక్షులు పొత్రకొండ ధర్మారావు, తెదేపా నాయకులు, స్థానిక ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



రాట మహోత్సవంలో స్థానికులు



రాటకు పూజలు చేస్తున్న భక్తులు

3 నుంచి దుర్గామల్లేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : రామ్‌నగర్‌లోని దుర్గామల్లేశ్వరి ఆలయంలో అక్టోబరు 3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల గోడపత్రికను శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. వచ్చే నెల 12 వరకు ఉత్సవాలు జరుగుతాయని, ఈ సందర్భంగా అమ్మవారు 9రోజుల పాటు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.



ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : స్వచ్ఛతా హీ సేవలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇగ్నో ఉపసంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు కోరారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇగ్నో ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత-వ్యక్తిగత పరిశుభ్రత అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్వచ్ఛ జీవన విధానంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రిన్సిపల్ ఆర్.మంజుల, అధ్యాపకురాలు శిరీష, ఇగ్నో ప్రాంతీయ కేంద్ర విభాగాధిపతి పతిరావునాయుడు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఇగ్నో ఉపసంచాలకులు కృష్ణారావు

'కబ్జాదారుల చెరలో శాంతి ఆశ్రమం స్థలం'

సీతంపేట, న్యూస్‌టుడే : 1949వ సంవత్సరంలో ఓం స్వామీజీ నుంచి వివేకానంద అనే వ్యక్తి ఉచిత యోగా శిక్షణ కోసం తీసుకున్న శాంతి ఆశ్రమానికి సంబంధించిన స్థలం యోగా శిక్షణకు కాకుండా వ్యాపారానికి వాడుకొంటున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. విశాఖ పౌరగ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆశ్రమ కమిటీ 20సంవత్సరాల నుంచి వారిపై న్యాయ పోరాటం చేస్తున్నారని, స్థలాన్ని కబ్జాదారుల నుంచి ఖాళీ చేసి, ఆశ్రమానికి అప్పజెప్పాలని హైకోర్టు, సుప్రీంకోర్టులు ఆదేశాలు జారీ చేశాయని చెప్పారు. ఈ ఆర్డరు కాపీతో కమిటీ సభ్యులు, కబ్జాదారులను కోరగా వారు చంపుతామని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ స్థలంలో ఫుడ్‌కోర్టు, పెట్రోల్ బంకు తదితర వ్యాపారాలతో గౌతమ్, సిద్ధార్థ అనేవారు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆయన తెలిపారు. తక్షణమే సుప్రీంకోర్టు ఇచ్చిన ఆర్డరు ప్రకారం పోలీసు కమిషనర్, మున్సిపల్ కమిషనర్ స్పందించి కబ్జాదారుల నుంచి స్థలాన్ని ఆశ్రమానికి అప్పగించాలని అభ్యర్థించారు. జనసేన నాయకులు పీతల మూర్తి యాదవ్ మాట్లాడుతూ కబ్జాదారులైన గౌతమ్, సిద్ధార్థలు శాంతి ఆశ్రమం స్థలాలే కాకుండా ప్రభుత్వ స్థలాలను, టూరిజం స్థలాలను అక్రమంగా ఆక్రమించి రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమానికి సంబంధించిన నరసింహరాజు, సాయిబాబ, ఎం.ఎన్.ఆదిత్య, వినమ్ర తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బొలిశెట్టి సత్యనారాయణ తదితరులు

శిక్షణ డీఎస్పీలు, ఎస్ఐల నగర సందర్శన

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నార్త్ ఈస్టు పోలీసు అకాడమీ (ఎన్ఈపీఏ)లో శిక్షణ పొందుతున్న ఐదుగురు డీఎస్పీలు, 10 మంది ఎస్ఐలు భారత్ దర్శన్ యాత్రలో భాగంగా నగరానికి వచ్చారు. పోలీసు అధికారుల మెస్‌లో నగరపోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీని మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పోలీసు విభాగానికి చెందిన కంట్రోల్‌రూమ్, 3వ పట్టణ పోలీసు స్టేషన్, ఫింగర్ ప్రింట్ బ్యూరోలతో పాటు పలు అధ్యయన కేంద్రాలను, చారిత్రాత్మక, పురావస్తు ప్రదేశాలను సందర్శించారు.



శిక్షణ పోలీసు సిబ్బందితో నగర పోలీసు కమిషనర్

ఆరోగ్య సిబ్బందికి సమయపాలన తప్పనిసరి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఆరోగ్య సిబ్బందికి సమయపాలన, ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఎంవీపీ సెక్టారు-9 ఫిషర్‌మెన్‌కాలనీలోని ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి డెంగీ కేసులను గుర్తించాలన్నారు. దోమల లార్వాల నిర్మూలనకు సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారిని ఆదేశించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్‌మాత్రలు అందజేయాలని సూచించారు.



నిల్వ ఉన్న నీటిలో లార్వాను గుర్తిస్తున్న డి.ఎం.హెచ్.ఒ.

అశ్రునివాళి



క్రీ॥శే॥ పుప్పాల నవగోపాల్ రావు గారు

జననం: 13.05.1932 మరణం : 17.09 2024

ఆయన అసంఖ్యాక హృదయాలను హత్తుకునే జీవితాన్ని గడిపారు. ఆయన దయ, ధాతృత్వం ఎప్పటికి ప్రతిధ్వనిస్తుంది. తుది స్వాస వరకు ఆయన అచంచలమైన , బలం, ధైర్యం మరియు సంకల్పం మా అందరికీ ప్రగాఢమైన స్ఫూర్తినిస్తుంది. ఆయన పవిత్ర హృదయానికి శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

సంస్మరణ సభ : 29.9.2024 న సంస్మరణ సభ మరియు మధ్యాహ్నం భోజనములు సాయిగ్రేస్ అపార్టుమెంటు, ఫ్లాట్ నెం 302, 3 వ లేన్, ద్వారకానగర్, విశాఖపట్నం నందు జరుగును.

కొడుకు: పుప్పాల నరసింహారావు కోడలు: పుప్పాల విజయదుర్గ

కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళు

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

మేము న్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM విశాఖ ఉత్తరం: 80747 24699 విశాఖ దక్షిణం: 80085 66543

కార్పొరేషన్, న్యూస్‌టుడే

సమస్య: పాతనగరం టౌన్‌కొత్త రోడ్డు చెత్త తరలింపు కేంద్రం నుంచి దుర్వాసన వస్తోంది. ఇక్కడి నుంచి చెత్తను తరలించాలి. – స్థానికులు, టౌన్‌కొత్తరోడ్డు.

సమాధానం: వర్షం కారణంగా చెత్త నుంచి దుర్వాసన వస్తోంది. త్వరలో కాపులుప్పాడకు తరలిస్తాం. –కేంద్రం ఇన్‌ఛార్జి

శాంతి ఆశ్రమం స్థలాన్ని కబ్జాదారుల నుంచి విడిపించండి

సీతంపేట, న్యూస్‌టుడే : 1949వ సంవత్సరంలో ఓం స్వామీజీ నుంచి వివేకానంద అనే వ్యక్తి ఉచిత యోగా శిక్షణ కోసం తీసుకున్న శాంతి ఆశ్రమానికి సంబంధించిన స్థలం యోగా శిక్షకుల కాకుండా వ్యాపారానికి వాడుకుంటున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. ఆశ్రమ కమిటీ 20సంవత్సరాల నుంచి వారిపై న్యాయ పోరాటం చేస్తున్నారని, స్థలాన్ని కబ్జాదారుల నుంచి ఖాళీ చేసి, ఆశ్రమానికి అప్పజెప్పాలని హైకోర్టు, సుప్రీంకోర్టులు ఆదేశాలు జారీ చేశాయని చెప్పారు. ఈ స్థలంలో ఫుడ్‌కోర్టు, పెట్రోల్ బంకు తదితర వ్యాపారాలతో గౌతమ్, సిద్ధార్థ అనేవారు కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆయన తెలిపారు. జనసేన నాయకులు పీతల మూర్తి యాదవ్, నరసింహరాజు, సాయిబాబు, ఎం.ఎన్.ఆదిత్య, వినమ్ర తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం సీఐగా వి.చంద్రశేఖర్



మాధవధార, న్యూస్‌టుడే: ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తానని, పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేస్తానని, శాంతి భద్రతల పట్ల తగు చర్యలు తీసుకుంటానని కంచరపాలెం పోలీస్ స్టేషన్ సీఐ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన ఆయన శుక్రవారం స్టేషన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్.భాస్కరరావు టాస్క్‌ఫోర్స్ సీఐగా బదిలీపై వెళ్లారు. 1998 బ్యాచ్‌కి చెందిన ఈయన శ్రీకాకుళం, విజయనగరంలో ఎస్.ఐ., సీఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐకు స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

అక్టోబర్ 1 నుంచి పోర్టు పింఛనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

మాధవధార, న్యూస్‌టుడే: హార్బర్ అండ్ పోర్టు, కార్గో హ్యాండ్లింగ్, ఫ్యామిలీ పింఛనుదారులు 2024కు సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను అక్టోబర్ 1 నుంచి నవంబర్ 15వ తేదీలోపు సమర్పించాలని పోర్టు పింఛనర్ల సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు తెలియజేశారు. విశాఖ పోర్టు పరిపాలన విభాగంలో సెంటిమూర్తి ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాంకు ద్వారా పింఛన్ బుక్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ బుక్, సెల్‌ఫోన్ నెంబర్ ఇచ్చి సమర్పించి నమోదు చేసుకోవాలని సూచించారు.

వరల్డ్ యూత్ బ్రేకింగ్ ఛాంపియన్‌షిప్‌కు నగర విద్యార్థులు



చైనాలో పెంటకోట చైతన్య, డి.ఆర్యన్

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: నగరంలోని అక్కయ్యపాలెం, ఎం.వి.పి.కాలనీకి చెందిన పెంటకోట చైతన్య, డి.ఆర్యన్ చైనాలో నేటి నుంచి జరిగే వరల్డ్ యూత్ బ్రేకింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. చైనాలోని వుక్సీ సిటీలో వరల్డ్ డ్యాన్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే బ్రేక్ డ్యాన్స్ పోటీలో వీరిద్దరూ భారతదేశం నుంచి అధికారికంగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2026లో జరిగే యూత్ ఒలింపిక్ పోటీలకి క్వాలిఫైయింగ్ కార్యక్రమంగా ఇది ఉపయోగపడుతుంది.

విద్యార్థుల రక్తదానం

సీతంపేట, న్యూస్‌టుడే : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు శుక్రవారం రక్తదానం చేశారు. కళాశాల పూర్వ అధ్యక్షులు వి.బి.వి.రెడ్డి శత జయంతి సందర్భంగా కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఎస్.కె.చక్రవర్తి, ఆచార్య దీపక్ చౌదరి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బుల్లయ్య కళాశాల విద్యార్థులు

మద్యం దుకాణాల్లో గౌడలకు రిజర్వేషన్‌పై హర్షం

అల్లిపురం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ(కల్లుగీత) కులాలకు 10శాతం రిజర్వేషన్ కల్పించడంపై ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజుగౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు యాత సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి నారా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం యాత వర్గీయులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 6లక్షల మంది యాత కులస్థులు ఉన్నారని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలి..

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్‌ప్లాంటును కేంద్ర ప్రభుత్వం పరిరక్షించాలని గాజువాక తెదేపా నాయకులు పల్లి వెంకటరమణారెడ్డి కోరారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్లాంటు పరిరక్షణ విషయంలో తెదేపా అండగా ఉంటుందన్నారు. ఈ మేరకు రూ.3వేల కోట్ల నిధులు సైతం కేంద్రం విడుదల చేసిందన్నారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, దొమ్మేటి అప్పారావు, గండేపు మహేష్‌రెడ్డి, ఎల్లేటి శ్రీనివాస్, అప్పలరెడ్డి, గణపతిరెడ్డి, అప్పలరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు 15రోజుల జైలు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన ఎం.శ్రీనివాస్ (54)కు 15రోజుల జైలు శిక్ష విధించినట్లు హార్బర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో తెలిపారు. హార్బర్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో పల్లి గణేష్‌బాబు ఆధ్వర్యంలో కాన్వెంట్ కూడలి వద్ద శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17 మందిని గుర్తించారు. వారిని 4వ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పి.నారాయణమూర్తి ఎదుట హాజరుపరిచారు. 16 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా, శ్రీనివాస్‌కు జైలు శిక్ష విధించినట్లు సీఐ చెప్పారు.

సుధాకర్‌ప్రసాద్ సేవలు నిరుపమానం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ రెవెన్యూ సేవల సంఘం రాష్ట్ర నేత తోటకూర సుధాకర్‌ప్రసాద్ అందించిన సేవలు నిరుపమానమని ఏపీఆర్ఎస్ఏ జిల్లా నాయకులు కొనియాడారు. సుధాకర్‌ప్రసాద్ వర్ధంతి సభ శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలోని సంఘం కార్యాలయంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్, సంఘం నాయకులు ఎస్.నాగేశ్వరరావు, శ్రీనాథ్, సీహెచ్ రమేష్, యోగి, బి.రవిశంకర్, శైలజ తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్‌ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రెవెన్యూ సంఘం నేతలు

చినుకు పడితే చిందరవందరే..

కంచరపాలెం, న్యూస్‌టుడే

కంచరపాలెం రైతుబజారుకు కూరగాయలు తీసుకొచ్చే రైతులకు కనీస వసతులు లేకపోవడంతో ఎప్పుడు వర్షం పడినా నరక యాతన అనుభవిస్తుంటారు. బజారులో మౌలిక వసతులు లేకపోవడంతో సుమారు యాభై మంది వరకు రైతులు నేలపైనే కూరగాయలు విక్రయిస్తుంటారు. వీరికి షెడ్డులు కట్టకపోవడంతో ఎండకు ఎండుతూ వర్షానికి తడుస్తూ బాధపడుతూనే అమ్ముతుంటారు. రైతుల గోడు పట్టించుకునే వారు లేకపోవడంతో వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. చినుకు పడితే చాలు.. వారంతా బెంబేలెత్తిపోతుంటారు. కూరగాయలన్నీ తడిసిముద్దవ్వడంతో పాటు బురద నీటిలోనే నిలబడి, వంగి అమ్ముతుంటారు. శుక్రవారం కురిసిన వర్షానికి రైతులు నానా అవస్థలు పడ్డారు. వరద, బురద నీటిలోనే విక్రయాలు చేపట్టారు. దీనివల్ల వినియోగదారులూ ఇబ్బందులు పడ్డారు.

★ ఎకరన్నర స్థలంలో రైతుబజారు ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి ఉన్న రేకుల షెడ్లే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వాటి స్థానే కింద, పైన అంతస్తులు వేస్తే అటు రైతులకు, ఇటు వినియోగదారులకు అవస్థలు తప్పుతాయనడంలో సందేహం లేదు.



వర్షానికి హెల్మెట్ పెట్టుకుని విక్రయాలు సాగిస్తున్న రైతు



తలకు ప్లాస్టిక్ కవరు చుట్టుకుని విక్రయిస్తున్న రైతు

రహదార్లు జలమయం

మాధవధార, న్యూస్‌టుడే: శుక్రవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 50, 51 వార్డుల్లో ఉన్న మట్టి రోడ్లలో నీరు నిల్వ ఉండి చిత్తడిగా మారాయి. కళింగ నగర్, సీతన్న గార్డెన్స్, మాధవధార ఆలయానికి వెళ్లే ప్రధాన రహదార్లు చిత్తడిగా మారాయి. ఆర్అండ్‌బీ నుంచి బిర్లా కూడలి వరకు సేవా రహదారిలో ఉన్న గెడ్డలు, ఉన్న పలు రహదారులు జలమయమయ్యాయి. సేవా రహదారిలో నీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే చోదకులు, ఆటో వాలాలు ఇక్కట్లకు గురయ్యారు.



సీతన్న గార్డెన్స్‌కు వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపు నీరు

ప్రగతిపథంలో బీఎస్ఎన్ఎల్ సొసైటీ



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ యాదమ్స్

మురళీనగర్, డాబాగార్డెన్స్, న్యూస్‌టుడే : బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల కోఆపరేటివ్ సొసైటీ 65వ వార్షిక మహాజన సభ శుక్రవారం సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.యాదమ్స్ మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా ఉద్యోగుల అవసరాలకు అండగా నిలుస్తూ సేవలందిస్తున్న ఈ సొసైటీ మరింత ముందుకు దూసుకుపోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పదవీ విరమణ పొందిన సంఘ సభ్యులను ఆయన ఘనంగా సత్కరించారు. ఉత్తమ ప్రతిభ చూపిన సభ్యుల పిల్లలకు విద్యా పురస్కార బహుమతులను అందజేశారు. ఈ ఏడాది సభ్యులకు షేర్ క్యాపిటల్‌పై 22.5 శాతం, థ్రిఫ్టుఫండ్‌పై 10 శాతం, డివిడెండ్ అందజేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు పి.శ్రీకాంత్‌రెడ్డి ప్రకటించారు. కార్యక్రమంలో డి.జి.ఎం. (అడ్మిన్) బి.శ్రీనివాసరావు, సంఘ కార్యదర్శి బి.ఎస్.చక్రవర్తి, ఉద్యోగులు పాల్గొన్నారు.

రూ.3.30లక్షల ప్యాకేజీకి ఎంపిక

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. ఆదిత్యబిర్లా, పెయింట్స్ డివిజన్ ప్రతినిధులు విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ప్లాస్టిక్ పాలిమర్స్ బ్రాంచ్ ఏడో సెమిస్టర్ విద్యార్థి వంశీ, ఆయిల్ టెక్నాలజీ బ్రాంచ్ ఏడో సెమిస్టర్ విద్యార్థి ప్రదీప్ కుమార్‌లు ఏడాదికి రూ.3.30లక్షల ప్యాకేజీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డి.దామోదర్, సి.హెచ్.జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అధికారి కె.బి.వి.ఎస్.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ, విభాగాధిపతులు

ఆలయం వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీ ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న శిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం ఆలయం 30వ వార్షికోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని ఆలయం వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, టి.రాంబాబు, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయంలో వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. వచ్చేనెల 3వ తేదీ నుంచి 12వ తేదీ దసరా వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉదయం సాయంత్రం శారదా మాత అమ్మవారికి కుంకుమ పూజ, పల్లకి తిరువీధి మహోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మహదేవ్ అప్పారావు, సిరిపురపు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

అక్కినేని శత జయంతి

సీతంపేట, న్యూస్‌టుడే : సినీనటులు దివంగత అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి(1924-2024) ఉత్సవం విశాఖ పౌరగ్రంథాలయంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత అతిథులు ఎస్.కె.మిస్రో, సుజాత, డి.భూపతిరావు, నరవ ప్రకాశరావు అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. డాక్టర్ చక్రవర్తి సినిమాను ప్రదర్శించారు.



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

జగన్ కల్తీ నాయకుడు: తెదేపా

అల్లిపురం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ చేసి మాజీ సీఎం జగన్ కల్తీ నాయకుడుగా నిలిచిపోయారని జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు అనంత లక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం అల్లిపురం దరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో తెలుగు మహిళలు వైకాపా నాయకుల మాస్కులు ధరించి మోకాళ్లపై నిరసన తెలిపారు. అనంతలక్ష్మి మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని దోచుకు తిన్నారని ఆరోపించారు. నెయ్యి కల్తీ విషయంలో వైకాపా నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడి రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీశారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో తెదేపా తెలుగు మహిళలు గనగళ్ల సత్య, కేదారి లక్ష్మి, రామలక్ష్మి, ప్రమీలారావు, భాగ్యలక్ష్మి, పుష్ప, దేవీ తదితరులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న తెలుగు మహిళలు

వి.బి.వి.రెడ్డి శతజయంతి ఉత్సవాలు

సీతంపేట, న్యూస్‌టుడే : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పూర్వ అధ్యక్షులు వి.బి.వి.రెడ్డి శత జయంతి వేడుకలను శుక్రవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు కేసీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విశ్రాంత ఐ.ఎ.ఎస్.అధికారి అజయ్ కల్లాం, ఆచార్య ప్రసన్న కుమార్, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ తదితరులు పాల్గొని మాట్లాడారు. తొలుత వి.బి.వి.రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు.



వి.బి.వి.రెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్య కె.సి.రెడ్డి తదితరులు

విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు అవార్డు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌కు ఉత్తమ ప్రతిబంధక పర్యాటక ప్రాజెక్టు అవార్డు లభించింది. శుక్రవారం విజయవాడలో ఈ అవార్డును విశ్వనాథ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ బి.కాశీవిశ్వనాథం అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ తాము రాబోయే ప్రాజెక్టులతో సాహసం, వినోదం కోసం ప్రీమియర్ స్థలంగా మార్చడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక, వినోద రంగాలను ప్రోత్సహిస్తామన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: సెక్టర్-8 వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. క్లబ్ సభాప్రాంగణంలో ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కె.కె.గార్డెన్, ఆకాశ్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ వారి సంయుక్త నిర్వహణలో ఉచిత దంతవైద్య పరీక్షలు నిర్వహిస్తారని క్లబ్ అధ్యక్షులు పల్లా చంద్రమౌళి తెలిపారు. సాధారణ పరీక్షలతో పాటు గుండె సంబంధిత పరీక్షలు కూడా జరుపుతారని వివరించారు. కాలనీవాసులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

ఎం.జి.ఎం పేరుతో సెవెన్‌హిల్స్ సేవలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: దశాబ్దాల కాలంగా సేవలందిస్తున్న సెవెన్‌హిల్స్ ఆసుపత్రి ఇక నుంచి ఎం.జి.ఎం హెల్త్‌కేర్ సెవెన్‌హిల్స్ ఆసుపత్రిగా సేవలందిస్తుందని ఎం.జి.ఎం సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్ తెలిపారు. సిరిపురంలో ఓ హోటల్లో శుక్రవారం ఉదయం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు ఆసుపత్రులు కలిసి ఒకటిగా పనిచేయడం ద్వారా నాణ్యమైన వైద్యంతో పాటు అధునాతన శస్త్ర చికిత్సలు అందించేందుకు వీలవుతుందని చెప్పారు. రాజగోపాలన్‌తో పాటు వింగ్ కమాండర్ సి.ఇ.వో ఎంకే బోస్ సమక్షంలో నూతన లోగోను ఆవిష్కరించారు.



ఎం.జి.ఎం డైరెక్టర్ రాజగోపాలన్‌తో పాటు ఆసుపత్రి వైద్యులు

కూటమి పాలనలో మహిళాభ్యున్నతికి పెద్దపీట

జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. 41, 42 వార్డులకు సంబంధించి 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని సుబ్బలక్ష్మీనగర్‌లోని కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వైకాపా పాలనలో దేవాలయాల్లో కూడా అవినీతి రాజ్యమేలిందని చెప్పారు. కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో పింఛను రూ.4వేలకు పెంచడంతోపాటు అన్న క్యాంటీన్లు ప్రారంభమయ్యాయని, ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు వస్తున్నాయన్నారు. దీపావళి కానుకగా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూపర్ సిక్స్‌లోని ప్రతి హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాము, దక్షిణ తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, జనసేన ఇన్‌ఛార్జి శివప్రసాద్, భాజపా ఇన్‌ఛార్జి అత్తిలి శంకరరావు, ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉషాకిరణ్, కూటమి నాయకులు ఐతి మధుబాబు, ఆంథోని శేఖర్, వంక సంజీవరావు, జగదీష్, నాగమణి, గురుగోవింద్, రమణ పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

4న వాణిజ్య సముదాయాల వేలం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-3 పరిధిలోని వాణిజ్య సముదాయాలను అద్దెకు ఇవ్వడానికి అక్టోబరు 4న వేలం నిర్వహించనున్నట్లు జెడ్సీ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వేలానికి గుత్తేదారులు ఎవరూ రాకపోవడంతో తిరిగి 4వ తేదీ ఉదయం 11 గంటల నుంచి జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం ఉంటుందని ప్రకటించారు. వివరాలకు కార్యాలయ పర్యవేక్షకుడిని సంప్రదించాలని కోరారు.



పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: నివాసాలు, పనిచేసే ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరి చేరవని జోన్-5 జెడ్సీ రాము అన్నారు. కాన్వెంట్ కూడలిలోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం జోన్-5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేపట్టి మార్కెట్ పరిసరాలను శుభ్రం చేశారు. జెడ్సీ రాము మాట్లాడుతూ మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బందితో పాటుగా మార్కెట్ అసోసియేషన్ సభ్యులపై ఉందన్నారు. వార్డు తెదేపా అధ్యక్షుడు ఐతి మధుబాబు, అసోసియేషన్ సభ్యులు కె.ప్రసాద్, విల్లూరి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జోనల్ అధికారులు, వ్యాపారులు

ఇంద్రాణి జగ్గారావు సేవలు ఎనలేనివి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విలువలతో కూడిన విద్యా వ్యవస్థ కోసం ఇంద్రాణి జగ్గారావు చేసిన కృషి మరువలేనిదని మిసెస్ ఏవీఎన్ కళాశాల వైస్ ఛైర్మన్, కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు అన్నారు. ఉత్తరాంధ్రలో గ్రామీణ మహిళల విద్యాభివృద్ధికి ఆమె కృషి చేశారన్నారు. ఏవీఎన్ కళాశాల వ్యవస్థాపకులు ఇంద్రాణి జగ్గారావు 90వ జయంతిని శుక్రవారం కళాశాల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలుమిని అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు మాకెన శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సింహాద్రినాయుడు, అధ్యాపకులు ఎంవీ భానుమతి, అర్చన, సుస్మిత, కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రాణి జగ్గారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అదీప్ భానోజీరావు

గ్రంథాలయ సంస్థ నూతన కమిటీకి అభినందనలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కమిటీకి సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు అభినందనలు తెలిపారు. శుక్రవారం నూతన కమిటీ ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అధ్యక్షులు వి.ఆనందరావు, ఉపాధ్యక్షులు దమయంతి, ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ నరసింహం, ప్రచార కార్యదర్శి రాజేంద్రవర్మ, కోశాధికారి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రతినిధి వై.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నాన్నారు.



వెంకటరావుతో ఉద్యోగుల సంఘం ప్రతినిధులు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అచ్యుతరావు తదితరులు

1 నుంచి ఉక్కు నిరాహార దీక్షలు

అల్లిపురం: స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అక్టోబరు 1, 2, 3 తేదీల్లో నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు తెలిపారు. అల్లిపురం దరి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు పరం కానివ్వమన్నారు. 1న జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద యువకులు, విద్యార్థులు, 2న కేంద్ర కార్మిక సంఘాలు, 3న మహిళా సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగుతాయన్నారు. నాయకులు కె.మల్లయ్య, ఎన్.కనకారావు, కె.శంకరరావు, కె.దేవ, ఎం.మన్మధరావు, ఎస్కే రెహ్మాన్ పాల్గొన్నారు.

జగన్‌పై చర్యలు తీసుకోవాలని లేఖ

వన్‌టౌన్: తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన ఘటనలో మాజీ సీఎం జగన్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ తెలుగు మహిళలు గనగళ్ల సత్య, కేదారిలక్ష్మి, రామలక్ష్మి, ప్రమీలారావు రాసిన లేఖను తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షులు గండి బాబ్జీకి శుక్రవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ప్రభుత్వానికి లేఖ పంపాలని కోరారు.



గండిబాబ్జీకి లేఖ అందజేస్తున్న తెలుగు మహిళలు

అశ్రునివాళి



శ్రీ।।శే।। పుప్పాల నవగోపాల్ రావు గారు

జననం: 13.05.1932 మరణం : 17.09 2024

ఆయన అసంఖ్యాక హృదయాలను హత్తుకునే జీవితాన్ని గడిపారు. ఆయన దయ, ధాతృత్వం ఎప్పటికీ ప్రతిధ్వనిస్తుంది. తుది స్వాస వరకు ఆయన అచంచలమైన, బలం, ధైర్యం మరియు సంకల్పం మా అందరికీ ప్రగాఢమైన స్ఫూర్తినిస్తుంది. ఆయన పవిత్ర హృదయానికి శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

సంస్మరణ సభ : 29.9.2024 న సంస్మరణ సభ మరియు మధ్యాహ్నం భోజనములు సాయిగ్రేస్ అపార్టుమెంటు, ఫ్లాట్ నెం 302, 3 వ లేన్, ద్వారకానగర్, విశాఖపట్నం నందు జరుగును.

కొడుకు: పుప్పాల నరసింహారావు కోడలు: పుప్పాల విజయదుర్గ

కూతుళ్ళు, అల్లుళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళు

చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ అప్పన్నరెడ్డికి సత్కారం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: తూ.కో.రైల్వే చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బి.అప్పన్నరెడ్డిని శుక్రవారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ సత్కరించారు. అఖిలభారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖలో సీనియర్ బాక్సర్ అయిన ఆయన క్రీడాకోటాలో 1985లో టీసీగా ఉద్యోగం పొందారు. పదవీవిరమణ పొందుతున్న ఆయన రైల్వే క్రీడా సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రస్తుతం విశాఖ జిల్లా బాక్సింగ్ సంఘం ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.



అప్పన్నరెడ్డిని సత్కరిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌సాహూ తదితరులు

బాక్సింగ్ విజేత.. నార్తర్న్ రైల్వే జట్టు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: అఖిల భారత అంతర రైల్వే బాక్సింగ్ పోటీలు రైల్వే స్టేడియం సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో శుక్రవారం ముగిశాయి. పోటీల్లో నార్తర్న్ రైల్వే జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. సౌత్ఈస్ట్ సెంట్రల్ రైల్వే జట్టు టీం ఛాంపియన్‌షిప్ గెలుపొందింది. విజేతలకు ట్రోఫీలు, పతకాలను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అందజేశారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించిన తూ.కో.రైల్వే క్రీడా సంఘం ప్రతినిధులను ప్రశంసించారు.

★ 63.5 కిలోల విభాగంలో పోరు హోరాహోరీగా సాగింది. తూర్పు కోస్తా రైల్వే క్రీడాకారుడు కె.శ్యామ్‌కుమార్‌పై నార్తర్న్ రైల్వే క్రీడాకారుడు అమిత్‌కుమార్ గెలుపొందాడు. రన్నరప్‌గా నిలిచిన శ్యామ్‌కుమార్‌కు రజత పతకం దక్కింది. ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ, క్రీడాధికారి ప్రవీణ్ భాటి, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్, రైల్వే క్రీడా సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహూ తదితరులు

నగరానికి పర్యాటక అవార్డుల పంట

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నగరానికి అవార్డుల పంట పండింది. శుక్రవారం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. పర్యాటక, ఆతిథ్య, సేవారంగాల్లో సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. రాష్ట్రంలో ఉత్తమ బీచ్‌గా రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ ఎంపికయింది. ఆయా విభాగాల్లో అవార్డు గ్రహీతలు వీరే..

★ ఉత్తమ పర్యాటక ఏజెంట్: ట్రావెల్ ఐక్యూ గ్లోబల్ సొల్యూషన్స్ ★ ఉత్తమ హోటల్: రాడిసన్ బ్లూ రిసార్ట్ ★ ఉత్తమ బడ్జెట్ హోటల్: ఎలిగెంట్ ★ ఉత్తమ బీచ్: రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్ ★ ఉత్తమ పర్యాటక ఆకర్షణీయ ప్రదేశం: గిరిజన మ్యూజియం, అరకు ★ ఉత్తమ కన్వెన్షన్ సెంటర్: చెన్నాస్ హెరిటేజ్ హోటల్ ★ ఉత్తమ విభిన్న పర్యాటక ప్రాజెక్టు: విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ ★ ఉత్తమ స్వదేశీ టూర్ ఆపరేటర్: ట్రావెల్ హోమ్ ★ ఉత్తమ వినూత్న స్వదేశీ టూర్ ఆపరేటర్: హాలిడే వరల్డ్ ★ ఉత్తమ పర్యాటక విద్యా సంస్థ: సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ★ ఉత్తమ పర్యాటక చిత్రం: బుద్ధం శరణం (టీవీ టూరిజం).



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న రాడిసన్ బ్లూ ప్రతినిధులు



మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ట్రావెల్ ఐక్యూ ఎండీ ఉషప్రియ



ఉత్తమ బడ్జెట్ హోటల్ అవార్డు అందుకుంటున్న ఎలిగెంట్ హోటల్ యజమాని పవన్ కార్తిక్



ఉత్తమ విభిన్న పర్యాటక ప్రాజెక్టు అవార్డు అందుకుంటున్న విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ యజమాని కాశీ విశ్వనాథ్



మంత్రి దుర్గేష్‌చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకట నాయుడు

డాల్ఫిన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్‌కు అవార్డు

ఎం.వి.పి.కాలనీ: విశాఖ డాల్ఫిన్ హోటల్‌కు చెందిన సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ డి.వెంకట నాయుడికి ఉత్తమ చెఫ్ అవార్డు దక్కింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. ఆయన డాల్ఫిన్ హోటల్‌లో గత 13 ఏళ్లుగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ చెఫ్‌గా పనిచేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు. యూరోపియన్, వెస్ట్రన్, కాంటినెంటల్, మెక్సికన్, ఇటాలియన్, ఫ్రెంచ్, ఇండియన్ తదితర వంటకాల్లో నిపుణుడిగా గుర్తింపు పొందారు. దేశ, విదేశాల్లో అంతర్జాతీయ, స్టార్స్ హోటళ్లలో వంటకాలను అందించిన అనుభవం ఉంది. శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు.

సకల శాస్త్రాలకు మాతృక భూ విజ్ఞానశాస్త్రం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: మానవుల ప్రతి అవసరం భూమితో ముడిపడి ఉందని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ కె.పద్మనాభయ్య పేర్కొన్నారు. ఏయూ భూ విజ్ఞానశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'మైనింగ్, ప్రాసెసింగ్, బీచ్ సాండ్ పరిశ్రమలో ప్రస్తుత పోకడలు, విలువ జోడింపు-మైనింగ్ చట్టాలు' అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సకల శాస్త్రాలకు మాతృక భూ విజ్ఞానశాస్త్రం నిలుస్తోందన్నారు. దేశంలో కేవలం మూడు ప్రాంతాల్లో మాత్రమే విలువైన ఖనిజాలను సముద్రపు ఇసుక నుంచి వెలికితీయడం జరుగుతోందని, ఇంకా పండని స్థాయిలో ఇటువంటి ప్రాంతాలు మన దేశ తీర ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ సముద్రపు ఇసుకలోని విలువైన ఖనిజాలు దేశానికి ఉపయుక్తంగా మలచుకోవాలని, అదే సమయంలో పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.



సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కె.పద్మనాభయ్య, ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు, అతిథులు

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సహాయంగా ఏయూ అనుబంధ కళాశాలలు నిధులు అందజేశాయి. ఆదిత్య విద్యా సంస్థల తరఫున కళాశాల ప్రాంతీయ సమన్వయకర్త రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ శుక్రవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు రూ.5 లక్షల చెక్కును అందించారు. ప్రైవేట్ బీఈడీ కళాశాలల యాజమాన్యాలు రూ.2.45 లక్షలు, ఎస్.కోటలోని పుణ్యగిరి డిగ్రీ కళాశాల యాజమాన్యం రూ.50వేల చెక్కులను రిజిస్ట్రార్‌కు అందించి ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న ఆదిత్య కళాశాల ప్రతినిధులు



రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న ప్రైవేటు బీఈడీ కళాశాల అధ్యాపకులు

ఏడీసీ సస్పెన్షన్ సరికాదు..

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పెదవాల్తేరు డిపో ఏడీసీ (అవుటాఫ్ డిపోడ్యూటీ)గా విధులు నిర్వహిస్తున్న ఏడీసీ కేఆర్‌రావును సస్పెండ్ చేయడంపై కార్మికులు అందోళన చేపట్టగా అధికారులు స్పందించకపోవడంపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విజయనగరం జోన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆర్ఎం అప్పలరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. కేఆర్‌రావుపై మళ్లీ విచారణ జరిపి, చర్యలు చేపట్టడానికి ఆదేశాలివ్వడం సరికాదన్నారు.

డీఆర్‌డీఓ సుస్థిరతకు ప్రాధాన్యం

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)ను సుస్థిరంగా మార్చేందుకు సాంకేతిక నిపుణులు, శాస్త్రవేత్తల తోడ్పాటు అవసరమని, అందరూ కలిసికట్టుగా పని చేయాలని నేవల్ సిస్టమ్స్, మెటీరియల్స్ జనరల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం ఎన్ఏడీకూడలి సమీప ఎన్ఎస్‌టీఎల్‌లో '51వ నేషనల్ సింపోజియం ఆన్ అకౌస్టిక్స్-2024' పేరిట సదస్సును నిర్వహించారు. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రక్షణ రంగంతో పాటు, వివిధ రంగాల్లో డీఆర్‌డీఓ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డీఆర్‌డీఓ రిసోర్సెస్, మేనేజ్‌మెంట్ జనరల్ మేనేజర్ మను కోరుల్లా, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ వివిధ అంశాలపై మాట్లాడారు. అనంతరం ధ్వని సంబంధిత ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేసి, కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు డాక్టర్ డీకే.అశ్వాల్, పీవీఎస్.గణేశ్‌కుమార్, నందగోపాలన్, మనోరంజన్. కృష్ణకుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు

దూసుకొచ్చిన మృత్యువు

లారీ ఢీకొని డాక్‌యార్డ్ ఉద్యోగి మృతి

అక్కిరెడ్డిపాలెం(షీలానగర్), న్యూస్‌టుడే : షీలానగర్ పోర్టు రోడ్డులో జరిగిన ప్రమాదంలో డాక్‌యార్డ్ ఉద్యోగి మృతి చెందిన ఘటనపై గాజువాక పోలీసులు తెలిపిన వివరాలివి. పెందుర్తి సమీప సరిపల్లిలో నివాసం ఉంటున్న ఎం.దిలీప్‌కుమార్(33) డాక్‌యార్డ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా... టోల్‌గేటు సమీపంలో వెనుక నుంచి దూసుకొచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. కింద పడిపోయిన దిలీప్‌కుమార్ తలకు బలమైన గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. శిరస్త్రాణం ఉన్నా.. ప్రాణాలు దక్కలేదని కుటుంబ సభ్యులు రోదించారు. దిలీప్‌కుమార్ స్వగ్రామం అల్లూరి జిల్లా హుకుంపేట. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేశామని సీఐ పార్థసారథి తెలిపారు.



దిలీప్‌కుమార్ (పాతచిత్రం)

చరవాణి అధిక వినియోగంతో దుష్ప్రభావాలు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: చరవాణిని గంటల తరబడి ఉపయోగిస్తూ..దానికి బానిస కావద్దని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ ఆర్.మంజుల సూచించారు. శుక్రవారం కళాశాలలోని రసాయనశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో మొబైల్ ఎడిక్షన్.. నష్టాలపై సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ చరవాణితో విద్యార్థులకే కాకుండా అన్ని వర్గాలవారికీ సమయం వృథా అవుతోందన్నారు. సాంకేతికను మనిషి అదుపులో ఉంచుకోవాలని, దానికి బానిస కాకూడదని పేర్కొన్నారు. అనంతరం పలువురు విద్యార్థినులు చరవాణి అధికంగా ఉపయోగిస్తే కలిగే నష్టాలను వివరించారు. అధ్యాపకులు సంతోషి అనూష, ఎ.హైమావతి, ఆర్.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



చరవాణి దుష్ప్రభావాలను వివరిస్తున్న విద్యార్థిని

విదేశీ పర్యాటకానికి తగ్గట్టుగా విశాఖను తీర్చిదిద్దుతా

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విశాఖను పర్యాటకపరంగా తీర్చిదిద్దుతానని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. సిరిపురం బాలల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా యంత్రాంగం, టూరిజం శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీటిని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో విశాఖలో సైన్స్ మ్యూజియంను కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. జిల్లాలోని చారిత్రక ప్రాంతాల గొప్పతనం భావితరాలకు తెలియపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. విదేశీ పర్యాటకం అభివృద్ధికి ఇక్కడ అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దేవుడ్ని ఎంత పవిత్రంగా చూసుకుంటామో అంతే పవిత్రంగా చారిత్రక ప్రదేశాలను చూసుకోవాలని తెలిపారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లకు బహుమతులను అందజేశారు. ఎడ్యుకేషన్ టూరిజం పోస్టర్‌ను ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మయూర్ కిషోర్, పర్యాటక అధికారి జ్ఞానవేణి, కళారత్న బాలకొండలరావు, అధిక సంఖ్యలో అధికారులు, కళాకారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తదితరులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

తప్పిపోయిన బాలిక అప్పగింత

కూర్మన్నపాలెం(వడ్లపూడి), న్యూస్‌టుడే : ఇంటి నుంచి తప్పిపోయిన బాలిక(5)ను తల్లికి అప్పగించిన ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. శుక్రవారం ఉదయం వడ్లపూడి హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్ద ఏడుస్తూ తిరుగుతున్న బాలికను సత్యనారాయణ అనే వ్యక్తి చేరదీశారు. ఆమె తల్లిదండ్రుల వివరాలు తెలియకపోవడంతో 100కు ఫోన్ చేసి సమాచారం అందజేశారు. దువ్వాడ బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్ కె.ఉమామహేశ్వరరావు, కె.గోవింద్ బాలికను తీసుకుని పరిసర కాలనీల్లో పర్యటించారు. ఎట్టకేలకు శ్రీగణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న తల్లికి బాలికను అప్పగించారు. సత్యనారాయణను, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్స్‌ను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

అక్టోబర్ 1 నుంచి లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

మాధవధార, న్యూస్‌టుడే: హార్బర్ అండ్ పోర్టు, కార్గో హ్యాండ్లింగ్, ఫ్యామిలీ పింఛనర్లందరూ 2024కి సంబంధించిన లైఫ్ సర్టిఫికెట్లను అక్టోబర్ 1 నుంచి నవంబర్ 15వ తేదీలోపు సమర్పించాలని పోర్టు పింఛనర్ల సంఘం అధ్యక్షుడు చౌదిరి అప్పారావు తెలియజేశారు. విశాఖ పోర్టు పరిపాలన విభాగంలో సాంబమూర్తి ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాంకు ద్వారా పింఛన్ బుక్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ బుక్, సెల్‌ఫోన్ నెంబర్ ఇచ్చి సమర్పించి నమోదు చేసుకోవాలని సూచించారు.

గంజాయి నిర్మూలనపై దృష్టి

పీఎంపాలెం: నగరంలో గంజాయి మత్తు నిర్మూలించేందుకు త్వరలో పోలీసు సిబ్బందికి టెస్టింగ్ కిట్లు అందించి, నిరంతరం తనిఖీలు చేపడతామని సీపీ శంఖబ్రత బాగ్చీ అన్నారు. శుక్రవారం ఆయన పీఎంపాలెం పోలీసుస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధానమైన, సమస్యాత్మక ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటలకు చోటెక్కడ...!

చిత్తడిగా క్రీడా మైదానాలు



గాజువాక వుడాకాలనీలో..



అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద..

న్యూస్‌టుడే, గాజువాక, అక్కిరెడ్డిపాలెం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాజువాక వుడాకాలనీ, నడుపూరు ఉక్కు క్రీడా మైదానం, అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి, బురదమయంగా మారడంతో క్రీడాకారుల సాధనకు వీల్లేకుండా తయారైంది. గొంతెనవానిపాలెం పరిసర కాలనీల నుంచి వచ్చే వరద నీరు ఎటూ వెళ్లే దారి లేక వుడా మైదానంలోకి చేరుతోంది. అలాగే 76వ వార్డు నడుపూరు ఉక్కు కళాక్షేత్రం క్రీడా మైదానంలో లోతట్టులో ఉండడంతో నీరు నిల్వ ఉంటోంది. అక్కిరెడ్డిపాలెం పాఠశాల మైదానంలోకి వరద చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి... ఆయా మైదానాల్లోకి వరద నీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నడుపూరు క్రీడా ప్రాంగణంలో..

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యం

సింధియా, న్యూస్‌టుడే : జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీడీఎస్ అధికారిణులు ఎం.వి.రమణకుమారి, శ్రీలత వివరించారు. అనంతరం ఒక్కో అంగన్‌వాడీ నుంచి హాజరైన 36 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలు జరిపారు. ఐసీడీఎస్ సూపర్వైజర్లు వరలక్ష్మి, జ్యోతి, టీచర్లు, తెదేపా నాయకులు శ్రీనివాసరావు, భాస్కర్, శ్రీలక్ష్మి, జోజిబాబు, సీహెచ్.రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాసోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు



కార్యక్రమానికి హాజరైన మహిళలు

"సమీకృత ఆహారమే తల్లీబిడ్డల ఆరోగ్యానికి కవచం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న 'పోషణ్ అభియాన్' పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. గర్భిణులు ఒత్తిడికి గురికాకుండా...మానసిక ప్రశాంతతతో ఉంటేనే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు." –గణబాబు, పశ్చిమ ఎమ్మెల్యే

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గోపాలపట్నం, గాజువాక, పెదగంట్యాడ

సమస్య : జీవీఎంసీ 90వ వార్డు గవరవీధి నుంచి బుచ్చిరాజుపాలెం వరకు ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా ఉంది.

–డి.ఎ.నాయుడు, ఎన్ఏడీకూడలి

సమాధానం : రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.

–వెంకటలక్ష్మి, ప్రజా పనుల విభాగం ఏఈ

?: కూర్మన్నపాలెం ఫేజ్-6లోని ఐటీసీ పైపు లైను కోసం గొయ్యి తవ్వి నిర్లక్ష్యంగా వదిలేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.

–ఎస్.వి.రమణ, కూర్మన్నపాలెం

✔: వర్క్ ఇన్‌స్పెక్టర్లను పంపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. –అప్పారావు, ఈఈ.

?: అగనంపూడి ఆర్టీఓ కార్యాలయం రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు.

–కృష్ణమూర్తి, షిర్డీసాయినగర్

✔: మరమ్మతులకు గురైన దీపాలను బాగు చేయిస్తాం. –శివ, వీధి దీపాల నిర్వాహకుడు

'కనీస పింఛను రూ.7500 అందించాలి'

కరాస, న్యూస్‌టుడే : అర్హులైన వారికి కనీస పింఛను మొత్తం రూ.7500 అందించి, ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని ఈపీఎఫ్-95 జాతీయ ఆందోళన కమిటీ(వైజాగ్) సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని ప్రాంతీయ భవిష్యనిధి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రస్తుతం చేతికొస్తున్న పింఛను సొమ్ము రూ.4వేలు ఎటూ సరిపోవడం లేదని, కేంద్రం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భవిష్యనిధి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సభ్యులు

ఉత్సాహంగా ఎంపిక పోటీలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) యూనిట్ ప్రాంగణంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్, అస్సాం రైఫిల్స్ వంటి సంస్థల్లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 23న ప్రారంభమైన ఎంపిక ప్రక్రియ నవంబరు 9 వరకు కొనసాగనుందని సిబ్బంది తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న యువకులకు రోజుకు 100 మంది చొప్పున దేహ దారుఢ్య పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని యూనిట్ సీనియర్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ తెలిపారు.



పరుగు పోటీలో పాల్గొన్న అభ్యర్థులు

నైపుణ్యాలతో ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య అన్నారు. శుక్రవారం కాపుజగ్గరాజుపేట విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి ఏడాది విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిత్యం కొత్త విషయాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతూ, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదువుపై దృష్టి సారించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ బి.అరుంధతి, డీన్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలి



నివాసితులతో మాట్లాడుతున్న ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్, సీఐ కోటేశ్వరరావు

గాజువాక, న్యూస్‌టుడే : జనావాసాల మధ్య కొనసాగుతున్న మద్యం దుకాణం తొలగించాలని గాజువాక సమీప శ్రీనగర్ విజయసాయి విహార్, రాయల్ షెల్టర్ అపార్టుమెంట్ నివాసితులు డిమాండు చేశారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన నివాసితుల సమావేశానికి ఏడీసీపీ కె.ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు హాజరయ్యారు. మద్యం దుకాణం తొలగింపు అంశాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. నివాసితులు సత్యనారాయణరెడ్డి, సీతారామయ్య, రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

అగనంపూడి, న్యూస్‌టుడే : 'ఇది మంచి ప్రభుత్వం' పేరిట శుక్రవారం జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తెదేపా నాయకులు పాల్గొని... వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు కర్రి దశేంద్ర, నాయకులు ప్రసాద్, రమణ, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ప్రదర్శిస్తున్న తెదేపా నాయకులు

అనధికార కట్టడాల తొలగింపు



పనులు చేపడుతున్న సిబ్బంది

గాజువాక, న్యూస్‌టుడే : గాజువాక సెలెస్ట్ అపార్ట్‌మెంట్‌లో అనధికార నిర్మాణాలను శుక్రవారం జీవీఎంసీ జోన్-6 పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగించారు. స్థానిక షాపింగ్ మాల్ కింద పార్కింగ్ స్థలంలో వాటర్ ట్యాంకు నిర్మించారంటూ కొందరు నివాసితులు జీవీఎంసీకి ఫిర్యాదు చేయడంతో తొలగింపు పనులు చేపట్టారు. జెడ్సీ శేషాద్రి, జోన్-6 డీసీపీ రామలింగేశ్వరరెడ్డి, టీపీబీఓ రేవతి పర్యవేక్షించారు.

ఆర్థికసాయం అందజేత



గాజువాక, న్యూస్‌టుడే విజయవాడ వరద బాధితులకు 76వ వార్డు గోపాలరెడ్డినగర్‌కు చెందిన పురోహితులు జాడ శ్రీనివాసశర్మ రూ.20 వేలు సాయం ప్రకటించారు. శుక్రవారం సీఎం సహాయ నిధి పేరిట తీసిన చెక్కును తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు అందించారు.

రూ.3.30లక్షల ప్యాకేజీకి ఎంపిక

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగాయి. ఆదిత్య బిర్లా పెయింట్స్ డివిజన్ ప్రతినిధులు విద్యార్థులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ప్లాస్టిక్ పాలిమర్స్ బ్రాంచ్ ఏడో సెమిస్టరు విద్యార్థి వంశీ, ఆయిల్‌టెక్నాలజీ బ్రాంచ్ ఏడో సెమిస్టరు విద్యార్థి ప్రవీణ్‌కుమార్‌లు ఏడాదికి రూ.3.30లక్షల ప్యాకేజీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ అందజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు డి.దామోదర్, సి.హెచ్.జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంటు ట్రైనింగ్ ప్లేస్‌మెంటు అధికారి కె.బి.వి.ఎస్.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **అనధికార పార్కింగ్‌పై చర్యలు**

సింధియా(నెహ్రూనగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం కొత్తనక్కవానిపాలెం, గాజువాక డిపో పరిసరాల్లోని సేవా రహదారిపై అనధికార పార్కింగ్‌పై గాజువాక ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. శుక్రవారం గాజువాక డిపో నుంచి పిలకవానిపాలెం వరకు రోడ్డు వెంబడి నిలిపి ఉంచిన వాహనాల వివరాలు సేకరించి, యజమానులను హెచ్చరించారు. కొన్ని వాహనాలను క్రేన్ల సాయంతో స్టేషన్‌కు తరలించారు.

● **అభివృద్ధి పనులకు నిధులు**

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డులో వివిధ అభివృద్ధి పనులకు సుమారు రూ.1.85 కోట్ల జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయని కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శుక్రవారం పేర్కొన్నారు. అదనపు పనులకు మరిన్ని నిధులు మంజూరు చేయాలని కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించామన్నారు.

● **పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: యువత వినూత్న ఆలోచనల్ని పెట్టుబడిగా పెట్టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని గీతం డీమ్డ్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు సూచించారు. భారత ప్రభుత్వ విద్యాశాఖ, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) సంయుక్తంగా వాధ్వాని ఫౌండేషన్ సహకారంతో గీతం వేదికగా అయిదు రోజుల పాటు నిర్వహించిన 'ఇన్నోవేషన్, డిజైన్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ (ఐడీఈ) బూట్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే వారికి సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం, ఓపిక, కష్టపడే తత్వం అవసరం అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

గాజువాక, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు, మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల సిబ్బంది కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకుని నినదించారు. పాఠశాల డైరెక్టర్ పి.భాస్కరరావు, కళాశాల ప్రతినిధులు రోజా, అనసూయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి శాంతినగర్ కాలనీ శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా చేపట్టిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



పూజలు చేస్తున్న భక్తులు

రూ.19.35 లక్షల ఆస్తిపన్ను వసూలు

గాజువాక, న్యూస్‌టుడే : ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూలు డ్రైవ్‌లో భాగంగా 70వ వార్డు సెలెస్ట్ అపార్ట్‌మెంట్ నుంచి సేకరించిన రూ.19.35 లక్షల చెక్కును జోన్-6 రెవెన్యూ అధికారులు రామనారాయణ, శ్రీకాంత్ శుక్రవారం జెడ్సీ బి.శేషాద్రికి అందజేశారు. ఆర్ఐ సయ్యద్ సుభాన్, సిబ్బంది పాల్గొన్నారు.

అమర్‌నాథ్‌కు అభినందనలు

గాజువాక, అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా వైకాపా అధ్యక్షుడిగా నియమితులైన గుడివాడ అమర్‌నాథ్‌కు శుక్రవారం పలువురు అభినందనలు తెలిపారు. మిందిలోని అమర్‌నాథ్ నివాసంలో జరిగిన కార్యక్రమాల్లో వైకాపా నాయకులు పల్లా చినతల్లి, పెంటారావు, మంత్రి శంకరనారాయణ, సంద్రాన నూకరాజు, సునీల్, నాయుడు పాల్గొన్నారు.

గాజువాక సినిమాలు..

కన్య, శ్రీకన్య:, మినీమోహినీ, అరుణ (పెదగంట్యాడ): అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), మోహినీ, లక్ష్మీకాంత్, విశేష్, మోహినీ 70ఎంఎం, లక్ష్మి: దేవర

ఎస్టీబీఎల్‌లో..: స్క్రీన్-2, స్క్రీన్-3, స్క్రీన్-4: దేవర



ముంచెత్తిన వర్షం



గోపాలపట్నం శ్మశానవాటిక కూడలిలో..

వాతావరణ మార్పులతో శుక్రవారం సాయంత్రం గోపాలపట్నం, ఎన్ఏడీకూడలి పరిసరాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. స్థానిక బీఆర్టీఎస్ రహదారిపైకి నీళ్లు చేరడంతో రాకపోకలు సాగించిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుచ్చిరాజుపాలెం, నందమూరినగర్ తదితర కాలనీ రహదారులు నీటి మునిగాయి.

–న్యూస్‌టుడే, గోపాలపట్నం

గొట్టమే లేదు.. నీరొచ్చేదెలా.. !

ఫోకస్



స్థానిక కుటుంబాల నీటి అవసరాలు తీర్చే గొట్టపుబావి (చేతి పంపు) మొరాయించడంతో పాతగాజువాక సమీప దశమికొండకాలనీ నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండ దిగువను ఉన్న బోరు పాడైపోవడంతో ఇటీవల జీవీఎంసీ సిబ్బంది తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. అయినా చుక్క నీరు రావడం లేదు. పైగా నీరు వచ్చే పైపు గొట్టం కూడా లేదు. కొత్తగా భూగర్భంలో కేసింగ్ పైపులు దించి వినియోగంలోకి తెస్తామని అధికారులు హామీ ఇచ్చినా... నేటికీ బోరును బాగు చేయలేదు. ఇప్పటికైనా నివాసితుల అవసరాలు గుర్తించి పునరుద్ధరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గాజువాక(శ్రామికనగర్)

దశమి ఉత్సవాలకు ఏర్పాట్లు



59వ వార్డు లక్ష్మీనగర్‌లో..



68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో..

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతంలో విజయ దశమి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం పలుచోట్ల రాటపూజలు నిర్వహించారు. 59వ వార్డు లక్ష్మీనగర్‌లో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు జి.సతీష్, కె.గురుమూర్తి, నర్సింగ్, మహిళలు పాల్గొన్నారు. ● అదే వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో మారుతీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సభ్యులు రామకృష్ణ, శివకుమార్, హనుమంతు, స్థానికులు పాల్గొన్నారు. ● కొత్తనక్కవానిపాలెం ఆటోస్టాండ్ సంఘం ఆధ్వర్యంలోనూ రాట పూజలు చేశారు.

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శ్రీ నవ్యాంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అక్టోబరు 3 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే : జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లో కాలనీ రెసిడెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో కాలనీ గౌరవ అధ్యక్షుడు తెంటు సత్యనారాయణ, అధ్యక్ష కార్యదర్శులు గొర్లి రామునాయుడు, పీవీటీ రమణారావు, కోశాధికారి బాసంగి తిరుపతిరావు పాల్గొన్నారు.

● పైడిమాంబకాలనీ సామాజిక భవనం వద్ద మాజీ కౌన్సిలర్ బి.సత్తిబాబు, నాయకులు అప్పలరాజు, తాతారావు, చిరంజీవి పూజలు చేశారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : కణితి నిర్వాసిత యాదవవీధిలో నిర్వహించిన కార్యక్రమంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు డి.తాతారావు, కె.శ్రీను, ఇ.అప్పలరాజు, బి.రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పైడిమాంబకాలనీలో..



76వ వార్డు గాంధీనగర్‌లో..



కణితి నిర్వాసిత యాదవవీధిలో..

